ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

వార్త

మంగళవారం 21, జులై 2026 16 పేజీలు






# క్షేత్ర స్థాయి వాస్తవాల ఆధారంగానే ఎల్‌నినోను ఎదుర్కోవాలి



## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- క్షేత్రస్థాయి పరిస్థితుల అధ్యయనానికే జిల్లా సమీక్షా సమావేశాలు
- అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ చేపట్టాలి
- వర్షపాతం లోటుపై ప్రతి రైతుకు స్పష్టమైన సమాచారం చేరాలి
- గతేడాది-ఈ ఏడాది నీటి లభ్యతపై నివేదిక విడుదల చేయాలి
- నాగార్జునసాగర్, పాలేరు నుంచి ఈ ఖరీఫ్‌లో సాగునీరు లేదు
- తాగునీటి అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలి
- ప్రత్యామ్నాయ తాగునీటి వనరులను ముందుగానే సిద్ధం చేయాలి
- రైతు వేదికల ద్వారా వాస్తవ పరిస్థితులను వివరించాలి
- బోర్ల ఆధారంగా నీటి అధిక అవసరమున్న పంటలు వేయొద్దు
- రాజీవ్ లింక్ కాలువ ద్వారా నీటి తరలింపుపై వెంటనే నివేదిక ఇవ్వాలి

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త**

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను శాస్త్రీయ అంచనాలు, క్షేత్రస్థాయి వాస్తవాలు, శాఖల సమన్వయంతోనే సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, త్రాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల ప్రణాళికలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ ఎల్‌నినో పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

వివరాలు 2

## భార్య వేధింపులుతట్టుకోలేక..

# భర్త ఆత్మహత్య?

### పెళ్లయిన మూడు నెలలకే దుర్ఘటన

**రఘునాదపాలెం, ప్రభాతవార్త జూన్ 20:**
ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో తండ్రితో కలిసి మేకల వ్యాపారం చేస్తూ, ఈ ఏడాది మే నెలలో హర్యాతండాకు చెందిన యువతిని పెళ్లి చేసుకున్న సదర్ లాల్ (27) అనే యువకుడుపెళ్లయిన మూడో రోజు నుండే నీకు మగతనం లేదని సదర్ లాల్‌ను వేధించసాగిన భాఇ్యటీవల సీత్లా పండుగ సందర్భంగా అత్తగారింటికి వెళ్లగా, కుటుంబ సభ్యులతో కలిసి సదర్ లాల్‌ను అవమానించిన



3వ పేజీలో...

## ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ..

# ఖమ్మానికి వరం



- వ్యవసాయరంగ పరిశ్రమలతోనే రైతులకు ఆదాయవృద్ధి : డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క
- ఖమ్మం కేంద్రంగా.. దేశంలోనే మొట్టమొదటి ఆయిల్ ఫామ్ సీడ్ గార్డెన్ ఏర్పాటు...
- కొణిజర్ల మండలం పారిశ్రామిక పార్కుగా అభివృద్ధి చెందాలి
- విలువ ఆధారిత వ్యవసాయంతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి
- రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు 10 లక్షల ఎకరాలకు విస్తరణే లక్ష్యం
- ప్రతి 10 వేల ఎకరాలకు ఒక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు లక్ష్యం
- కొణిజర్ల మండలం అంజనాపురంలో గోద్రెజ్ కంపెనీ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి

**కొణిజర్ల, జూలై 20, ప్రభాతవార్త**

వ్యవసాయ రంగ పరిశ్రమలను అభివృద్ధి చేసి చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే రైతుల ఆదాయం పెరిగి సుస్థిర వృద్ధికి తోడ్పాటు అవుతుందని..డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో.. గోద్రెజ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన దేశంలోనే మొట్టమొదటి సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార,

2వ పేజీలో...

# క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగానే ఎల్‌నినోను ఎదుర్కోవాలి

మొదటి పేజీ తరువాయి..

జూలై 15 నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, రైతులు ప్రస్తుతం పత్తి అధికంగా సాగు చేశారని, వర్షాలు వస్తే వరి పంట వేద్దామని చూస్తున్నారని, భూగర్భ జలాలు గలవారు వరి పంట సాగుకు ముందుకు వెళ్తున్నారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ.. భూగర్భ జలాలు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రాబోయే రెండు నెలల్లో మరింత తగ్గిపోతాయని, రైతులు ఎవరు వరి పంట సాగు చేయవద్దని ఆయన కోరారు.క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే జిల్లాల్లో సమీక్షా సమావేశాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి పారుదల, ప్రణాళిక, వ్యవసాయ, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు కార్యాచరణను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన వర్షపాతం లోటు ఎంత, దాని ప్రభావం ఏమిటనే అంశాలపై ప్రతి రైతుకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రభుత్వం వద్ద ఉన్న వాస్తవ సమాచారం క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.గత ఏడాది, ఈ ఏడాది నీటి వనరుల లభ్యత, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిపై వివరాలతో ప్రణాళిక శాఖ సమగ్ర నివేదిక సిద్ధం చేసి మీడియాకు, క్షేత్రస్థాయి అధికారులకు, రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించిన మేరకు రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లా అవసరాలకు ఎలా వినియోగించుకోవచ్చో అన్ని సాంకేతిక అవకాశాలను పరిశీలించి తక్షణమే సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వర్షపాతం పరిస్థితులు, నీటి వనరుల లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి మాత్రమే రైతులు పంటల ఎంపిక చేసుకునేలా క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఈ ఖరీఫ్‌లో సాగునీరు వచ్చే పరిస్థితి లేదని, పాలేరు ఆయకట్టుకు కూడా సాగునీరు అందుబాటులో ఉండదని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. వాస్తవ పరిస్థితులను దాచకుండా అధికారులు నేరుగా రైతులతో మాట్లాడాలని సూచించారు.ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో త్రాగునీటి అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కడైనా త్రాగునీటి వనరులు సరిపోని పరిస్థితి ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ వనరులను గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రాబోయే ఒక సంవత్సరం త్రాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.భూగర్భ జలాల లభ్యత ఆధారంగా మాత్రమే పంటల ప్రణాళిక రూపొందించాలని, వరి వంటి నీటి అధిక అవసరమున్న పంటలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు. పెసర, మినుములు, కందులు, అలసంద, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను మాత్రమే రైతులు సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశము ఉన్నందున బోర్ల ఆధారంగా వరి సాగు చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాలు, భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కూడా ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం గణనీయంగా తగ్గిందని, నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇటువంటి తీవ్రమైన కరువు పరిస్థితులు దాదాపు 150 సంవత్సరాలకు ఒకసారి సంభవించే అవకాశం ఉన్నందున ప్రతి మండల స్థాయి అధికారి అత్యంత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశముందని, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున రానున్న రోజుల్లో విద్యుత్ సరఫరా పై కూడా ప్రభావం పడే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో బోర్లపై ఆధారపడి నీటి అధిక అవసరమున్న పంటలను సాగు చేయకుండా రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించా లని సూచించారు.రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. అధికారులు మౌనంగా ఉండకుండా వాస్తవ పరిస్థితులను రైతులకు స్పష్టంగా తెలియ జేయాలని, సమాచార ప్రసారంలో సమర్థవంతమైన విధానాన్ని అవలంబించాలని సూచించారు. నీటి లభ్యత లేని పరిస్థితుల్లో వరి సాగు చేస్తే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఏమీ చేయలేదనే పరిస్థితి రాకుండా ముందుగానే స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు. నీటి లభ్యత లేని పరిస్థితుల్లో వరి సాగు చేస్తే అది పూర్తిగా రైతుల సొంత బాధ్యతేనని స్పష్టమైన సందేశం క్షేత్రస్థాయిలో చేరాలని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాధ్యమైనన్ని ప్రాంతాల్లో గోదావరి బ్యాక్‌వాటర్‌ను ఎత్తిపోసి చెరువులను నింపేందుకు అవసరమైన మోటార్లు, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేసే ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రస్తుతం గోదావరి నీటిని వినియోగించి చెరువులను నింపగలిగితే వచ్చే వేసవి వరకు త్రాగునీటి అవసరాలను తీర్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఖరీఫ్‌లో సాగునీటికి నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లా అవసరాలకు ఎలా వినియోగించాలనే అంశంపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ప్రస్తుతం వైరా, లంకా సాగర్ జలాశయాలను త్రాగునీటి అవసరాల కోసమే నింపుతున్నా మని, పాలేరు జలాశయంలో కూడా సెప్టెంబర్ 2026 వరకు మాత్రమే తాగునీటి నిల్వలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి నీటిని పాలేరు జలాశయానికి తరలించే అవకాశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను అవకాశంగా మలుచుకొని ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. రాబోయే మూడు నెలల పరిస్థితులకే పరిమితం కాకుండా కనీసం ఒక సంవత్సరం కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.ప్రతి మండలానికి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రతి రైతుకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ, వ్యవసాయ, నీటిపారుదల, భూగర్భ జలాల, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వ యంతో స్థానిక సమాచారాన్ని విశ్లేషించి మండల స్థాయి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.ప్రతి మండలంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి మండలానికి సంబంధించిన ధృవీకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు అందించాలని తెలిపారు. మండల స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, జిల్లా స్థాయిలో సమగ్ర కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి వర్షపాతం, త్రాగునీటి పరిస్థితి, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షి ంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ.. జూలై 31వ తేదీ వరకు జిల్లాలో పప్పు ధాన్యాలు, అలసంద, కందులు, పెసర వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు జరిగేలా గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, సాగునీటికి ఉన్న అవకాశాలపై స్పష్టమైన సమాచారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. సొంత బోర్లు ఉన్న రైతుల వివరాలను సేకరించి, ముఖ్యంగా సత్తుపల్లి ప్రాంతంలో అధికంగా వరి సాగు జరుగుతున్నందున అక్కడ ప్రత్యేక దృష్టి సారించి రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో వరి సాగును నిరుత్సాహ పరుస్తూ కూరగాయల సాగును కూడా ప్రోత్సహిస్తున్నామని, అవసరమైన విత్తనాలను ఇప్పటికే సిద్ధంగా ఉంచామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పూర్తి సమాచారం అధికారులకు అందుబాటులో ఉండాలని, ప్రస్తుతం జరుగుతున్న అన్ని ఎత్తిపోతల ద్వారా నీటి సరఫరా త్రాగునీటి అవసరాల కోసమేనని, సాగునీటి కోసం కాదనే విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియ జేయాలని సూచించారు. ఆగస్టు 1వ తేదీ నుండి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ ఏడాది అదనంగా 8 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు వచ్చారని, మరో 5 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల విస్తరణ లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు.కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేకపోవడం, భూగర్భ జలాలు కూడా వేగంగా తగ్గిపోతున్న పరిస్థితిని క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తిగా వివరించి, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం డిప్యూటీ సీఎం, మంత్రివర్యులు, జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ తెలంగాణ జలసిరి, ఎల్ నినో సూపర్ స్థితిలో తీసుకునే చర్యలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, సుడా ఛైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఖాదర్ బాబా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఖమ్మానికి వరం

మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్ ఇండస్ట్రీస్ ఛైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌లు స్థానిక సర్పంచితో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు.అనంతరం ఫ్యాక్టరీలోని ఉత్పత్తి విభాగాలు, ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు, వాటి నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించి ,సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యవసాయానికి చిరునామాగా నిలిచిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు హెవీ వాటర్ ప్లాంట్, థర్మల్ పవర్ స్టేషన్, నవభారత్ వంటి పరిశ్రమలు ఉండేవని, రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన తర్వాత ప్రస్తుతం ఖమ్మం జిల్లా ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడుతోందన్నారు. పాలేరు జలాశయం, నాగార్జునసాగర్ ఎడమ కాలువ, వైరా రిజర్వాయర్ లు ఈ ప్రాంత రైతాంగానికి జీవనాధారమని పేర్కొన్నారు.రైతుల ఆదాయం పెరగాలంటే సంప్రదాయ పంటల ఉత్పత్తితో పాటు ఆయిల్ పామ్ వంటి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగుదిశగా అడుగులు పడడం అవస్యకమన్నారు. ఈ అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సమగ్రంగా వివరించారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు నాలుగు సంవత్సరాల కాలంలో ఎకరాకు సుమారు రూ. 52 వేల వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తోందని తెలిపారు. సూపర్ ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఆయిల్ పామ్ సాగు నిలకడైన దిగుబడిని అందిస్తుందని చెప్పారు.దేశంలో వంటనూనెల అవసరం ఎక్కువగా ఉన్నదని, దేశీయ ఉత్పత్తి 12 మిలియన్ టన్నులకు మాత్రమే పరిమితమైందన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 3 మిలియన్ టన్నుల వంటనూనె దిగుమతుల కోసం రూ.1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమని స్పష్టం చేశారు.199192లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ సాగుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సుమారు 15 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, దేశ అవసరాలకు అనుగుణంగా దానిని 70 లక్షల ఎకరాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. 2023లో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.12 వేలుగా ఉండగా ప్రస్తుతం సుమారు రూ.23 వేలకు చేరడం రైతులకు ప్రయోజనకరంగా మారిందన్నారు. వంట నూనెతో పాటు సౌందర్య సాధనాల పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలను కూడా ఆయిల్ పామ్ ద్వారా అందించవచ్చని తెలిపారు.ఖమ్మం జిల్లాలో ఈ సమీకృత ఆయిల్ ఫాం పరిశ్రమ ఏర్పాటవడం రైతులకు, యువతకు వరంగా నిలుస్తుందని పేర్కొంటూ, ఈ పరిశ్రమ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం కృషి చేశారని ప్రత్యేకంగా అభినందించారు. గోద్రెజ్ యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అధికారులు అందరికీ అభినందనలు తెలిపారు.ఈ పరిశ్రమకు అవసరమైన రహదారి మౌలిక సదుపాయాలను టీజీఐఐసీ ద్వారా త్వరలోనే కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో మరిన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పడి రైతులు పండించే పంటలకు స్థానికంగానే విలువ ఆధారిత ఉత్పత్తులు తయారయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. దీని వల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.ఈ సమీకృత ప్రాజెక్టులో సీడ్ గార్డెన్, మిల్లింగ్ యూనిట్, రిఫైనరీ వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు కావడం విశేషమన్నారు. భవిష్యత్తులో ఆయిల్ పామ్ విత్తనాల కోసం ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. 113 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ సమీకృత పరిశ్రమ గంటకు 60 నుంచి 120 టన్నుల గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. గోద్రెజ్ సంస్థ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, మిర్చి, పత్తి, వరి ఆధారిత పరిశ్రమలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని సంస్థను కోరారు.రైతులు వాణిజ్య పంటలు, విలువ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర స్థూల ఆర్థికోత్పత్తి సుమారు రూ.17 లక్షల కోట్లు ఉండగా, వ్యవసాయ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉండటం రైతుల ఆర్థిక పరిస్థితిని సూచిస్తోందన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే వాణిజ్య పంటలు, విలువ ఆధారిత పరిశ్రమలే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. ఇటీవల తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు పెట్టుబడి సాయం జమ చేశామని తెలిపారు. నాగార్జునసాగర్, కృష్ణా జలాలు, సీతారామ ఎత్తిపోతల పథకం, పాలేరు లింక్, ఎన్నెస్పీ-రాజీవ్ లింక్ కాలువల ద్వారా లభించే నీటిని వినియోగించుకొని ఖమ్మం జిల్లాలో ఉద్యాన పంటల సాగును మరింత విస్తరించాలని సూచించారు.వ్యవసాయ పార్కుగా కొణిజర్ల మండలం..కొణిజెర్ల మండలం భవిష్యత్తులో రాష్ట్రం లోనే ప్రముఖ పారిశ్రామిక పార్కుగా ఎదగాలని ఆకాంక్షి ంచారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న సీడ్ గార్డెన్ ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ విత్తనాలు అందించే స్థాయికి ఈ కేంద్రం ఎదగాలని అన్నారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలపై ప్రతి గ్రామంలో రైతులతో చర్చలు నిర్వహించి అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.ఆయిల్ ఫామ్ హబ్ గా తెలంగాణ.. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ ఆయిల్ పామ్ గెలల కొనుగోలు లో రైతులకు భాగస్వామిగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో ఆయిల్ పామ్ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసే అవకాశాలు మరింత విస్తరించాయని, దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఒకప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయిల్ పామ్ సాగు, నేడు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, రానున్న 2 నుంచి 3 సంవత్సరాల్లో దానిని 10 లక్షల ఎకరాలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.దేశ వంటనూనెల్లో స్వయం సమృద్ధి సాధించాలంటే సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు అవసరమని చెప్పారు. ప్రస్తుతం దేశంలోని ఆయిల్ పామ్ సాగులో దాదాపు 90 శాతం తెలుగు రాష్ట్రాల నుంచే జరుగుతోందన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు మూడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు పనిచేస్తుండగా, గోద్రెజ్ ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ నాలుగో ఫ్యాక్టరీ అని తెలిపారు.దేశంలో ఇప్పటి వరకు ఆయిల్ పామ్‌కు ప్రత్యేక సీడ్ గార్డెన్ లేకపోవడం గమనార్హమని, గోద్రెజ్ సంస్థ మలేషియా భాగస్వామ్యంతో ఖమ్మంలో దేశంలోనే తొలి ఆధునిక సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. సీడ్ గార్డెన్‌తో పాటు పరిశోధన కేంద్రం, రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శన విభాగాలు, శిక్షణ కార్యక్రమాలు, నాణ్యమైన నర్సరీల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు కూడా నేటి నుంచే శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.ఈ సమీకృత ఆయిల్ పామ్ కేంద్రం రైతులకు అన్ని విధాలా ఉపయోగపడు తుందని మంత్రి పేర్కొన్నారు. రైతుల సందేహాల నివృత్తి, శాస్త్రీయ సాగుపై మార్గదర్శకాలు, నాణ్యమైన మొక్కలు, వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగు మందులు, అవసరమైన సాంకేతిక సేవలు ఒకే కేంద్రంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# వాహనాల తనిఖీల్లో గంజాయి పట్టివేత.

**స్కార్పియో,రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం.....**

**రూ.23.60 లక్షల విలువైన గంజాయి,సెల్‌ఫోన్లు సీజ్.**

**ముగ్గురు అరెస్ట్...ఇద్దరూ పరారీలో.**

*పాల్వంచ టౌన్,జూలై 20, (ప్రభాత వార్త):*

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సమీపంలోని రంగాపురం వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మొత్తం 40 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.గంజాయిని తరలిస్తున్న ఒక స్కార్పియో వాహనం,రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడంతో పాటు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమి రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సి.హెచ్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం రంగాపురం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో అనుమానాస్పదంగా వచ్చిన స్కార్పియో వాహనాన్ని ఆపి పరిశీలించగా 27.5 కిలోల ఎండు గంజాయి లభించింది.ఈ గంజాయిని ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న బినయ్ సర్కార్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు.అనంతరం తనిఖీ చేసిన హీరో స్ప్లెండర్ ప్లస్ ద్విచక్ర వాహనంలో 6.2 కిలోల గంజాయి లభించింది.ఈ కేసులో నూప రవికిరణ్ను అదుపులోకి తీసుకోగా,తాళ్ల ధనరాజ్ పరారీలో ఉన్నట్లు గుర్తించారు. వీరు మల్కాన్‌గిరి నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లికి గంజాయిని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఇక మరో హీరో గ్లామర్ వాహనంలో 6.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని వేల్పుల భరత్,గద్దల శశాంక్‌లను అరెస్టు చేశారు. వీరు కూడా మల్కాన్‌గిరి నుంచి ములకలపల్లికి గంజాయిని తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.మొత్తంగా మూడు వాహనాల నుంచి 40 కిలోల ఎండు గంజాయి,మూడు వాహనాలు,నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న అధికారులు వాటి మొత్తం విలువ సుమారు రూ.23.60 లక్షలు ఉంటుందని తెలిపారు.స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ నిమిత్తం పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్‌తో పాటు కానిస్టేబుళ్లు రమేశ్‌బాబు,రాజు, ప్రసన్నకుమార్ ,తిరుపతి,ఉపేందర్ పాల్గొన్నారు.ప్రజలకు గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 4252523కు తెలియజేయాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.ఈ వివరాలను డిప్యూటీ కమిషనర్ వి. సోమి రెడ్డి,అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్,కొత్తగూడెం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాస్ రెడ్డి,ఏఈఎస్ సి.హెచ్. శ్రీనివాస్,పాల్వంచ ఎక్సైజ్ సీఐ ఎం.ప్రసాద్ మీడియాకు వెల్లడించారు.



# భార్య వేధింపులుతట్టుకోలేక భర్త ఆత్మహత్య

**పెళ్లయిన మూడు నెలలకే దుర్ఘటన**

*రఘునాదపాలెం, ప్రభాతవార్త జూన్ 20:*

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో తండ్రితో కలిసి మేకల వ్యాపారం చేస్తూ, ఈ ఏడాది మే నెలలో హర్యాతండాకు చెందిన యువతిని పెళ్లి చేసుకున్న సదర్ లాల్ (27) అనే యువకుడుపెళ్లయిన మూడో రోజు నుండే నీకు మగతనం లేదని సదర్ లాల్‌ను వేధించసాగిన భాఇ్యటీవల సీత్లా పండుగ సందర్భంగా అత్తగారింటికి వెళ్లగా, కుటుంబ సభ్యులతో కలిసి సదర్ లాల్‌ను అవమానించిన భాత్యీవ్ర మనస్తాపంతో అక్క దగ్గరికి వెళ్తున్నానని చెప్పి, బావకు ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పి, లొకేషన్ పంపిన సదర్ లాల్ దీంతో వి. వెంకటాయపాలెం కాలువ దగ్గరికి వెళ్లి చూడగా, అక్కడ సదర్ లాల్ బైక్, ఫోన్, కలుపు మందు డబ్బాను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చిన కుటుంబ సభ్యులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులుఅయితే పెళ్లికి ముందే యువతి వేరే వ్యక్తితో ప్రేమలో ఉందని, పెళ్లయ్యాక కూడా సంబంధం కొనసాగించేందుకే సదర్ లాల్‌కు మగతనం లేదని పంచాయతీ పెడితే, మెడికల్ టెస్టులు చేయించామని తెలిపిన సదర్ లాల్ కుటుంబ సభ్యులు

# ఢిల్లీలో విద్యార్థి, యువతపై టియర్ గ్యాస్ ప్రయోగించి లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండించండి

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి**

**పేపర్ లీకేజీ మాఫియాకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలకడం సిగ్గుచేటు**

**పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వి రాకేష్**

*కామేపల్లి, జూలై 20 ప్రభాత వార్త:*

నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, సోనమ్ వాంగ్‌చుక్ పిలుపులో భాగంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో శాంతియుతంగా ఛలో పార్లమెంట్ కి వెళ్తున్న విద్యార్థి, యువతపై కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు లాఠీ చార్జి చేయడం, భాష్ప వాయువు ప్రయోగించడం సిగ్గుమాలిన చర్య అని ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వి రాకేష్ అన్నారు.సోమవారం ఎన్ వి రాకేష్ ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ సందర్భంగా ఎన్ వి రాకేష్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 20 మంది విద్యార్థులకు న్యాయం చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.గత కొన్ని రోజులుగా అనేక రూపాల్లో ఆందోళన జరుగుతున్నప్పటికీని కేంద్ర ప్రభుత్వం నిరక్ష ్యంగా వ్యవహరించడం సరైంది కాదని, విద్యార్థుల పట్ల నిరక్ష ్య వైఖరి వీడనాడి వెంటనే కేంద్ర మంత్రివర్గం నుండి



ధర్మేంద్ర ప్రధాన్ ను బర్త్ రఫ్ చేయాలని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే తన డిమాండ్లపై కనీసం చర్చించకుండా బలవంతంగా పోలీసు బలగాలు వచ్చి దీక్షను విరమింప చేయడం అప్రజస్వామ్యమని అని అన్నారు. దేశంలోని 24 లక్షల మంది విద్యార్థులకు మద్దతుగా న్యాయమైన డిమాండ్ సాధన కోసం ఆందోళన చేస్తుంటే ఇలాంటి ఫాసిస్టు చర్యలకు పాల్పడటం సరైన కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 84 కి పైగా పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు.విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని విమర్శించారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేస్తూ, జైళ్లలో నిర్బంధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ కారణంగా నష్టపోయిన విద్యార్థులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థి వ్యతిరేక విధానాల అవలంబిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వానికి సంఘటిత ఉద్యమాలతో తగిన గుణపాఠం చెబుతామని అన్నారు.ఢిల్లీలో విద్యార్థి యువతపై జరిగిన టియర్ గ్యాస్ ప్రయోగించి లాఠీచార్జిని విద్యార్థులు, మేధావులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.

# స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి..

**ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

*కొణిజర్ల జూలై 20ప్రభాత వార్త:*

వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ అంజనాపురంలో సమీకృత ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నాయకత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. గత 30 సంవత్సరా లుగా ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటూ వచ్చారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభమై, నేడు పూర్తై ప్రారంభోత్సవం జరగడం ఈ ప్రాంత ప్రజల కల సాకారమైన రోజుగా అభివర్ణించారు.గోద్రెజ్ సంస్థ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఫ్యాక్టరీలో ఉద్యోగాల భర్తీలో స్థానిక వైరా నియోజకవర్గ యువత ప్రతిభావంతులు, నైపుణ్యం కలిగిన వారని, వారికి ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.






# మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష

*కొత్తగూడెం టౌన్, జూలై 20 ప్రభాతవార్త:*

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై సుజాతనగర్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన ఒక వ్యక్తికి కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. ఈ ఏడాది ఏప్రిల్ 29 రాత్రి సుజాతనగర్ సబ్‌ఇన్స్పెక్టర్ ఎం. రమాదేవి ఆధ్వర్యంలో నాయకులగూడెం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ములకలపల్లి కి చెందిన రవ్వా వినోద్ అనే వ్యక్తి మద్యం సేవించి ట్రాక్టర్ నడుపుతూ పట్టుబడ్డాడు. బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా అతని శరీరంలో 210 ఎంజి/100 ఎంఎల్ ఆల్కహాల్ రీడింగ్ నమోదైంది. మోటార్ వాహనాల చట్టం సెక్షన్ 185 కింద పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాలకే ప్రమాదమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సుజాతనగర్ ఎస్ఐ రమాదేవి హెచ్చరించారు.

# రైల్వే ప్లాట్ ఫామ్ పై వ్యక్తి మృతి

*మధిర జూలై 20 ప్రభాతవార్త*

అనారోగ్య కారణాలతో ఒక వ్యక్తి రైల్వే స్టేషన్ రెండో ప్లాట్ ఫామ్ పై మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. రైల్వే స్టేషన్ ఎం.అనిల్ కుమార్ ఇచ్చిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే జి ఆర్ పి పోలీసులు వద్ద దొరికిన ఆధారాల మేరకు రఘునాధపాలెం మండలం కోయచిలక గ్రామానికి చెందిన వేల్పుల భిక్షం (45) గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి శవ పంచాంగం నిమిత్తం మధిర ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు అయినా తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్ సి వెల్లడించారు.



# యువకుడిపై ఫోక్సో కేసు నమోదు

*అశ్వారావుపేట రూరల్, జూలై 20 ప్రభాతవార్త*

స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం ఓ యువకుడి పై ఫోక్సో కేసు నమోదయింది. అశ్వారావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను సంతోష్ (23) అనే యువకుడు ఇంటి వద్ద దింపుతానని బండిమీద ఎక్కించుకొని పాత మామిళ్ల వారి గూడెం శివారు ఓ పొలంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదుతో స్థానిక పోలీస్ స్టేషన్లో సదరు యువకుడి పై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

*కామేపల్లి, జూలై 20 ప్రభాతవార్త:*

కామేపల్లి మండలం నెమలిపురి గ్రామం లో నూతనంగా నిర్మించనున్న వివోఏ భవన నిర్మాణ పనులకు సోమవారం తెలం గాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని డ్వాక్రా మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలు ఏర్పాటు చేస్తూ మహిళా సాధికారతకు కృషి చేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య బలరాం నాయక్, ఉప సర్పంచ్ సిద్ధ బోయిన అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పి.రాజేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గింజల నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రామ్ రెడ్డి జగన్నాథ్ రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ దమ్మాలపాటి సత్యనారాయణ, కిసాన్ సెల్ అధ్యక్షులు వరికొల్లు సైదులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, వివోఏలు పాల్గొన్నారు.






# నిరాహార దీక్ష భగ్నం పరిష్కారం కాదు

## కేంద్రం ప్రజాస్వామ్య నిరసనలను గౌరవించాలి

### టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు డిమాండ్




**భద్రాచలం, ప్రభాతవార్త జూలై 20:** న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ దీక్షను భగ్నం చేయడం సమస్యకు పరిష్కారం కాదని, దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న ప్రజాస్వామ్య నిరసనలను కేంద్ర ప్రభుత్వం గౌరవించి స్పందించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు పేర్కొన్నారు. సోమవారం భద్రాచలంలోని టిపిటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీక్ కారణంగా వేలాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేయని పక్షంలో కేంద్ర ప్రభుత్వం ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరారు. నీట్ వ్యవహారానికి సంబంధించి ప్రాణాలు కోల్పోయిన 13 మంది విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, వారి కోసం జరిగే ప్రజాస్వామ్య పోరాటాలకు టిపిటిఎఫ్ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సమస్యను అణచివేత ధోరణితో కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిపిటిఎఫ్ రాష్ట్ర అకాడమిక్ సెల్ సభ్యులు మునిగడప రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు పాయం కృష్ణయ్య, ఎ. రామ్‌చంద్, వివిధ మండలాల నాయకులు బి. రవి, బి. కాంతి కిరణ్, బి. ప్రకాశ్ రావు, వి. ముత్తయ్య పాల్గొన్నారు

# అంజనాపురం-జింకలగూడెం మార్గంలోని సీతారామ కెనాల్ బ్రిడ్జి రోడ్డు పై గోతులు

### మరమ్మత్తులు చేయించాలని వాహనదారుల వేడుకోలు



**బూర్గంపహాడ్ ,ప్రభాతవార్త:** బూర్గంపహాడ్ మండలంలోని అంజనాపురం -జింకలగూడెం ప్రధాన రహదారిపై ఉన్న సీతారామ ప్రాజెక్టు కెనాల్ బ్రిడ్జి రోడ్డు గోతులు ఏర్పడి. వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతుంది. రోజూ వేలాది వాహనాలు, విద్యార్థులు, రైతులు ఈ మార్గం గుండా ప్రయాణిస్తుండగా, బ్రిడ్జి పరిస్థితి మాత్రం ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాల రాకపోకలతో బ్రిడ్జిపై కాంక్రీట్ పూర్తిగా ఊడిపోయింది. అడుగు లోతు గోతులు, బయటకు వచ్చిన ఇనుప రాడ్లు వాహనదారులకు తీవ్ర ప్రమాదంగా మారాయి. రాత్రిపూట చీకట్లో ప్రమాదాలు నిత్యకృత్యంగా జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ప్రయాణిస్తున్నప్పటికీ, మరమ్మతులపై ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. పలుమార్లు ఆర్ అండ్ బి, సీతారామ ప్రాజెక్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రాణనష్టం జరగకముందే జిల్లా కలెక్టర్, ఆర్. అండ్ బి శాఖ అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న బ్రిడ్జిని మరమ్మతు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వైద్య ఖర్చులకు ఇద్దరికీ మేవా ఆర్థికసాయం



**సారపాక, ప్రభాతవార్త:**

సారపాక గ్రామానికి చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సారపాక కు చెందిన ఇద్దరికీ వైద్య ఖర్చులకోసం 20000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. గత కొంత కాలం గా అనారోగ్యంతో బాధపడుతున్న యండి. మహుముద్దీన్ ఖాన్ అనే కాంట్రాక్ట్ కార్మికుడు కిడ్నీకి సంబంధించిన వ్యాధితో బాధపడుతూ భద్రాచలం మోహన్ రావు హాస్పటల్లో చికిత్స పొందుతున్నాడు ఆర్థిక సహాయం కోసం వారి కుటుంబ సభ్యులు మేవా కమిటీని సంప్రదించగా కమిటీ నిర్ణయం మేరకు మహుముద్దీన్ ఖాన్ కు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా మండల పరిధిలోని కోయగూడెం పంచాయతీ చెందిన షేక్ యాకుబ్ ప్రమాదవశాత్తు కింద జారి పడటంతో అనారోగ్యంతో బాధపడుతూన్నాడు వైద్యం చేయించుకుంటున్నారు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి గమనించి మేవా కమిటీ తరఫున వారికి కూడా 10000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మేవా ప్రతినిధులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి తమ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మహమ్మద్ ముస్తఫా. ప్రధాన కార్యదర్శి జహీర్ భాషా. సోహెల్ పాషా. సైదుద్దీన్. అక్బర్. అబ్దుల్ సలీం. అజీజ్. ఉస్మాన్. తదితరులు పాల్గొన్నారు

# పాత బావిని పూడ్చి అంగన్‌వాడీ, పిహెచ్సి ఏర్పాటు చేయాలి

### సారపాక 4వ వార్డు ప్రజల వినతి

**సారపాక, ప్రభాతవార్త:** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక మేజర్ గ్రామ పంచాయతీ 4వ వార్డులో సుమారు 45 సంవత్సరాల క్రితం ఐ.టి.సి.పి.ఎస్.పి.డి. వారు నిర్మించిన పాత తాగునీటి బావి ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది.



పాలకేంద్రం ఎదురుగా, టవర్ పక్కన ఉన్న ఈ బావిలో వాడకం లేకపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. దీనివల్ల దోమలు విపరీతంగా పెరిగి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై 4వ వార్డు ప్రజలు గ్రామ సర్పంచ్ కిషోర్ కు, ఐ.టి.సి.పి.ఎస్.పి.డి. యాజమాన్యానికి వినతి పత్రం అందజేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాత బావిని వెంటనే పూడ్చివేయాలి. ఆ స్థలంలో 4వ వార్డు ప్రజలకు ఉపయోగపడేలా ఒక అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి అని వారు కోరారు. ప్రజా ప్రతినిధులు అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరోగ్య అవగాహన

### విద్యార్థినులకు ఎన్ డి డి మాప్‌అప్ రౌండ్, హెచ్ పి వి వ్యాక్సిన్ పై అవగాహన

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:** మోరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. నగేష్ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని తెలంగాణ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కళాశాల హాస్టల్లో సోమవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐ ఈ సి కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, సబ్బుతో చేతులు కడుక్కోవడం, సమతుల్య పోషకాహారం, రక్తహీనత నివారణ గురించి అవగాహన కల్పించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం లో భాగంగా అర్హులైన విద్యార్థినులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసి వేయించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు అర్హులైన బాలికలు హెచ్ పి వి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ, టీకాల ప్రాముఖ్యత పై కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత, హెల్త్ ఎడ్యుకేటర్ డి. పరంగిణి, హెల్త్ సూపర్వైజర్ ఆర్. రమణ, ఏఎన్ఎం రమణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా రామయ్య నిత్య కళ్యాణం

భద్రాచలం కల్చరల్ ప్రభాతవార్త జూలై 20



భద్రాద్రి, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం సోమవారం ఘనం గా ఆలయ పండితులు నిర్వహించారు. అందునా ఈరోజు సోమ వారం కావటం వలన స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు ఆలయాలకు అనుబంధమైన శ్రీ లక్ష్మీ తయారుఅమ్మవారి మరియు ఈ పవిత్ర వేడుకలో ముందుగా మూలవరులకు ఆంజనేయు ల వారుకూడా ముత్తంగి సేవలో భక్తులకు కన్నుల విందు చేసారుఅభిషేకం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు అలంకరించి సీతారామచంద్ర స్వామి వారి దివ్య కళ్యాణాన్ని వేదిక సాంప్రదాయ పద్ధతిలో జరిపించారు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా కళ్యాణ ఘట్టంలో పాల్గొని ఆ దివ్య దంపతుల ఆశీర్వాదాలు పొందారు వేద ఘోషలు మంగళ వాయిద్యాలు మరియు జైశ్రీరామ్ నామస్మరణ మధ్య ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయగా ఆలయ అధికారులు ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు సీతారామచంద్ర స్వాముల వారి నిజ కళ్యాణా న్ని దర్శించి తమ జీవితాల్లో ఆయురారోగ్యాలు సుఖసాంతులు ఐశ్వర్యాలు కలిగించాలని ఆ శ్రీరామచంద్రస్వామివారిని మనసా వాచా కర్మణా కోరుకుంటూ తీర్థప్రసాదాలను తీసుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ పెద్దలు వైదిక సిబ్బంది మరియు ఆలయ అధికారులు అందరూ పాల్గొని కళ్యాణ లడ్డూలు మరియు పులిహార ప్యాకెట్లను అందజేశారు.

# దాతృత ఫౌండేషన్ చేయూత

### విద్యార్థులకు నోట్ పుస్తకాలు బ్యాగులు అందజేత

**చర్ల, జులై 20, ( ప్రభాతవార్త )** బోదనెల్లి కొర్కటంపాడు ఎర్రబోరు రామ చంద్రాపురం గిరిజన గ్రామాల విద్యార్థులకు శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ మహాక్షేత్రం చిన్న అరుణాచలం వ్యవస్థాపకులు శివ నాగస్వామి సారథ్యంలో హైదరాబాదు దాతృత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ నోటు పుస్తకాలు పెన్నులు పెన్సిల్స్ లను అందజేశారు. ఈ సందర్భంగా శివనాగస్వామి మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నతమైన శిఖరాలను అధిరోహించి మన ఊరికి కన్న తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా మన ఆచార వ్యవహారాలు సంస్కృతి సంప్రదాయాలను మరువరాదు అని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ శ్రావణ్ రాజేష్ కుమార్ రాకేష్ బన్నీ తరుణ్ శ్రీకాంత్ శ్రీ శర్మ రాజేష్ కుమార్ శ్రీహరి ఫణింద్ర బంటి శ్రీకాంత్ బందా మధు వేములపల్లి ప్రవీణ్ కుమార్ పాసిగంటి శ్రీదేవి మైనేని పద్మజా పెందుర్తి ఆంజనేయులు సిద్దాంతి శ్రీనివాస్ కుర్నపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



# రామవరం సింగరేణి డిస్పెన్సరీని పునఃప్రారంభం

**రుద్రంపూర్, జూలై 20 ప్రభాతవార్త:** సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవారంలో ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన డిస్పెన్స రీని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ ప్రాజెక్ట్స్) కె. వెంక టేశ్వర్లు ఘనంగా పునః ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో డిస్పెన్సరీని ఆధునికీకరించి తిరిగి అందు బాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ మాట్లాడుతూ... ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ డిస్పెన్సరీలో ఒక స్టాఫ్ నర్స్ ను నిరంతరం అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన వైద్య సేవలు, మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు మాట్లాడుతూ... రామవరంలో పునరుద్ధరించిన డిస్పెన్సరీ ద్వారా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మరియు పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని, ఈ వైద్య సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీకేసీఎంలో నూతనంగా కొనుగోలు చేసిన నాలుగు క్రేన్లను ప్రారంభించారు. ఈ క్రేన్ల వినియోగంతో గని నిర్వహణ పనులు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగడంతో పాటు భద్రతా ప్రమాణాలు,





ఉత్పాదకత మరింత మెరుగుపడుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రేన్లు భారీ యంత్ర పరికరాల తరలింపు నిర్వహణ మరియు పనులను సులభతరం చేస్తాయని ఉత్పాదకత లో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆధునికరణకు సింగరేణి సంస్థ నిరంతరం ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవి నరసింహారావు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, డిజిఎం (ఐఈడి) యోహన్, ఏఐటీయూసి సెంట్రల్ సెక్రెటరీ వంగా వెంకట్, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, రామవరం కార్పొరేటర్ కె. జమలయ్య, ఎస్.ఓ టు జీఎం ఎం. గోవిందరావు, (సిఎంఓఏఐ) జనరల్ సెక్రటరీ ఉపేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఇన్చార్జ్ హెచ్ఓడీ (సివిల్) కె. రాజారాం, మేనేజర్ (ఐటిగ) శేష శ్రీ, డివైపిఎం హరీష్, ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య, ఐఎన్టియుసి ఫిట్ సెక్రెటరీ సాగర్, అధికారులు, వైద్యాధికారులు, వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గౌరవ డాక్టరేట్ అందుకున్న డాక్టర్ ఎడవల్లి కృష్ణ

### లయన్స్ క్లబ్ ద్వారా విశేష సేవలందిస్తున్న ప్రజల మనిషికి సత్కారం...

### నిగర్వి, ఎంజేఎఫ్ లయన్ ఎడవల్లి కృష్ణ

**కొత్తగూడెం, జూలై 20 ప్రభాతవార్త:** న్యూ ఢిల్లీలోని ఇండియా హ్యాబిటా యూబిట్ సెంటర్‌లో జరిగిన ఖిఇండో ఇంటర్నేషనల్ ఇంటెలెక్చువల్ కాన్కేవ్ఖి కాన్వొకేషన్ వేడుకలో, ప్రముఖ విద్యావేత్త, సేవ తాత్పరుడు, మదర్ థెరిసా కాలేజ్ ఆఫ్ ఇంజ నీరింగ్ టెక్నాలజీ (పెద్దపల్లి) వ్యవ స్థాపక చైర్మన్ ఎడవల్లి కృష్ణ కి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది. యూకే ఎఫ్, అభిమానులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాల్వంచ కి చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక సంఘసంస్కర్త, సేవతాత్పరుడు, నిస్వర్ధపరుడు ఎడవల్లి కృష్ణ సోమవారం న్యూ ఢిల్లీలో జరిగిన కాన్వొకేషన్‌లో అమెరికాలోని ప్రతిష్టాత్మక మేరీల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా వారు ఈ అరుదైన గౌరవాన్ని స్వీకరించారు. మదర్ థెరిసా విద్యాసంస్థల ద్వారా విద్యారంగానికి వారు చేసిన సేవలకు ఈ అవార్డు సముచిత గుర్తింపు లభించింది, అదే విధంగా లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవలందిస్తున్న ప్రజల మనిషి నిగర్వి ఎంజేఎఫ్ లయన్ ఎడవల్లి కృష్ణ లయనిజంలో ఆయన అందిస్తున్న సేవలకు రాబోవు రోజుల్లో గవర్నర్ కాబోతున్నారు. డాక్టర్ కృష్ణ ఎడవల్లి కి యూకే ఎఫ్ తరపున, తెలుగు రాష్ట్రాల ప్రజల తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.






## ఎఐటియుసి పోరాట ఫలితంగా రామవరం డిస్పెన్సరీ పునఃప్రారంభం

**రుద్రంపూర్, జూలై 20 ప్రభాతవార్త:**



గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) చేపట్టిన నిరంతర పోరాటం ఫలితంగా రామవరం సింగరేణి డిస్పెన్సరీని యాజమాన్యం సోమవారం ఉదయం పునఃప్రారంభించింది. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ పాల్గొని మాట్లాడుతూ... రామవరం డిస్పెన్సరీని యథావిధిగా కొనసాగించడంతో పాటు పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించాలని కోరుతూ ఈ ఏడాది మే 31న ప్రధాన ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి (సీఎంఓ) డా. కిరణ్ రాజ్, ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజుకు ఎఐటియుసి నాయకులు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఎఐటియుసి చేసిన నిరంతర కృషి, యాజమాన్యంపై తీసుకొచ్చిన ఒత్తిడి ఫలితంగానే రామవరం డిస్పెన్సరీ తిరిగి ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఉపాధ్యక్షుడు కత్తెర్ల రాములు, నాయకులు హుమాయూన్, మండల రాజేశ్వరరావు, మల్లికార్జున్, అప్పారావు, సీపీఐ నాయకులు కంచర్ల జములయ్య, కార్పొరేటర్ శంకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి నిల్వ సంరక్షణ పనులు చేపట్టండి భూగర్భ జలాల పెంపుదలకు తోడ్పడండి

**కామేపల్లి, జూలై 20 ప్రభాతవార్త:** సేద్యపు కుంట (ఫారం పాండ్ ) లను రైతులు నిర్మించి భూగర్భ జలాల పెంపుదలకు తోడ్పడాలని కామేపల్లి ఎంపీడీవో ధరావత్ సోమలాల్ సోమవారం కోరారు. నీటి నిల్వ సంరక్షణ పనులు వర్షపు నీరు భద్రపరుచుటకు, వ్యవసాయ రంగాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు ఎంతగానో దోహదపడతాయి అన్నారు. ఫారం పాండ్ లను నిర్మించుకొని ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాన్ని పొందాలని కోరారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.




చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలి

**కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 20 ప్రభాతవార్త:**



స్థానిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ కళాశాల నూతన నూతన సమితి ని ఎన్నుకోవడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యల పరిష్కరించాలని పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలపై విద్యార్థులే పోరాడాలని ఏఐఎస్ఎఫ్ సంఘం విద్యార్థి పోరాటాలకు దిక్సూచిగా ఉంటుందని విద్యారంగ సమస్యల పట్ల రాజీలేని పోరాటాలకు విద్యార్థుల సిద్ధం కావాలని కళాశాల సమితి చదువుకుంటూ కళాశాల సమస్యలపై పరిష్కారం వైపు అడుగులు వేయాలని ఏఐఎస్ఎఫ్ సంఘం ఎల్లప్పుడూ శాస్త్రీయ విద్యా విధానానికి దోహదపడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం అండగా ఉంటుందని అజిత్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్సు లు గుగులోత్ వంశీ మాణిక్యాల వినయ్ జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్ నాయకులు దినేష్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణా తరగతులు ప్రారంభం

**కొత్తగూడెం, జూలై 20 ప్రభాతవార్త:** సింగరేణిలోని సెక్యూరిటీ విభాగంలో పని చేస్తున్న 29 మంది సెక్యూరిటీ సిబ్బందికి వారం రోజులపాటు జరుగు 42వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులను ఏరియా సెక్యూరిటీ అధికారి/ట్రైనింగ్ అధికారి యం. డి జాకీర్ హుస్సేన్ కొత్తగూడెంలో యస్ పి.సి. ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని, అందులో భాగంగా యస్ పి.సి. విభాగములో ప్రతి సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణనివ్వడం జరుగుతుందని, తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడిందని, వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై బోధించడం జరుగుతుందని, అందుకోసం మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుండి ఫ్యాకల్టీని తీసుకోవడం జరుగుతుందని, మనకు ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళే లోపు వారి ప్రాణాలను కాపాడవచ్చునని, మనం పని చేయు ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షించాలని, మెరుగైన వృత్తి నైపుణ్యంతో, క్రమశిక్షణతో, నీతినిజాయితీతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాటుపడాలని తెలిపారు. జూనియర్ ఇన్స్పెక్టర్ కె. రాజనర్సు వందనసమర్పణ చేసారు.



# డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం, 2023" పై శిక్షణ

### కార్పొరేట్ ఏరియా జనరల్ మేనేజర్లకు, అధికారులకు అవగాహన...



**కొత్తగూడెం, జూలై 20 ప్రభాతవార్త:** "డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం, 2023" అమలుచేయుట కొరకు కార్పొరేట్ ఏరియా లోని జనరల్ మేనేజర్లకు, అధికారులకు సంబంధిత అధికారులకు సోమవారం నాడు కొత్తగూడెం ఇల్లందు క్లబ్ నందు హెచ్ఆర్డి డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో హిందూస్థాన్ అకాడమీ ఆఫ్ లా, విశాఖపట్నంప్రొఫెసర్ వి.పార్వతీశం వారి చే ఒక్క రోజు శిక్షణా తరగతులను నిర్వహించడం జరిగింది. ఈ తరగతులలో శిక్షణా కార్యక్రమం లోహిందూస్థాన్ అకాడమీ ఆఫ్ లా, విశాఖపట్నం ప్రొఫెసర్ వి.పార్వతీశం గారు మాట్లాడుతూ భారతదేశంలో డిజిటల్ పౌరుల ఆన్లైన్ గోప్యతను, వ్యక్తిగత సమాచారాన్ని రక్షించడానికి డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం, 2023 రూపొందించబడినది అని, నవంబర్ 2025లో ప్రభుత్వం డీపీడీపీ నియమాలు, 2025 నోటిఫై చేయడంతో ఈ చట్టం పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి వచ్చింది అని మే 13, 2027 నాటికి అన్ని సంస్థలు దీనికి పూర్తిగా కట్టుబడి ఉండాలని తెలిపారు. ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం వ్యక్తులు తమ వ్యక్తిగత డేటాను రక్షించుకునే హక్కును కాపాడుతూనే, చట్టబద్ధమైన ప్రయోజనాల కోసం కంపెనీలు లేదా ప్రభుత్వాలు ఆ డేటాను ప్రాసెస్ (ఉపయోగించడం) చేయవలసిన అవసరాన్ని సమతుల్యం చేయడం అని తెలిపారు. అనంతరం ఈ శిక్షణా కార్యక్రమములో డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం, 2023కు సంబంధించిన అన్ని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేస్ స్టడీస్ రూపం లో వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమములో కార్పొరేట్ ఏరియాలోని జనరల్ మేనేజర్లు, శాఖాధిపతులు, అధికారులు, డిజిఎం(హెచ్ఆర్డి) జి.మదన్ మోహన్, డివై.పిఎం మైత్రేయ బంధు, హెచ్ఆర్డి డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

### పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించిన ఏఎంసీ చైర్మన్






**లక్ష్మీదేవిపల్లి, జూలై 20 ప్రభాతవార్త:** రైతులు, వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగించే మార్కెట్ యార్డును, మార్కెట్ యార్డ్ పరిసర ప్రాంతా లను పరిశుభ్రంగా ఉంచేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ ప్రత్యేక దృష్టి సారించారు. చిన్న చినుకు పడిన ఎగువ నుండి వచ్చే వరద నీటి ప్రవాహంతో మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతమంత చిన్నపాటి పిల్ల కాలువలా మారి వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాక, మార్కెట్ యార్డులోని దుకాణాలకు వెళ్లేందుకు దారి కూడా లేకుండా పోతుంది. ఈ నేపథ్యంలో చైర్మన్ లాల్ సింగ్ నాయక్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించడంతో పాటు డ్రైనేజీల శుభ్రపరచడం, పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త సేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని సంజయ్ నగర్ సర్పంచ్ తాటి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. కాగా సోమవారం మార్కెట్ యార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించి, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమలు, ఈగలు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని మార్కెట్ యార్డ్ సిబ్బందిని ఆదేశించారు. రైతులు తమ పంటలను విక్రయించేందుకు వచ్చే సమయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం తమ ప్రధాన బాధ్యత అని చైర్మన్ పేర్కొన్నారు. మార్కెట్ యార్డు పరిశుభ్రంగా ఉంటే రైతులతో పాటు వ్యాపారులకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. పరిశుభ్రమైన మార్కెట్ యార్డు ద్వారా మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఏఎంసీ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి, ఏఎంసీ సిబ్బంది, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, పాల్గొన్నారు.

# వైటీపీఎస్ లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 23వ రోజు నిరసన

**పాల్వంచ, జూలై 20 ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్పీఈజాక్) పిలుపు మేరకు యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లోని యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ విభాగాల ప్రైవేటీకరణ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ సోమవారం కేటీపీఎస్లో 23వ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ వద్ద పెద్ద ఎత్తున ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిసన్లు పాల్గొని ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా, ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల సామర్థ్యం, భద్రత, ప్రజా ప్రయోజనాలు దెబ్బతింటాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన, విశ్వసనీయమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలంటే ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను మరింత బలోపేతం చేయాలని వారు పేర్కొన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లోని ఏహెచ్పి, సిహెచ్పి విభాగాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, ఉద్యోగుల ప్రయోజనాలు, సంస్థ భవిష్యత్తు, రాష్ట్ర విద్యుత్ రంగ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో జాక్ చైర్మన్ రాజేందర్, కన్వీనర్ ఎస్.కె. యస్మీన్, సెక్రటరీ జనరల్ కరుణాకర్ రెడ్డి, జేపీసీ నాయకులు ఉమామహేశ్వరరావు, బ్రహ్మజీ, మడకం శ్రీనివాసరావు, రాజేష్, ప్రభాకర్, అఖిల్, మధుబాబు, మహేష్, రఘువీర్, డోలి శ్రీనివాసరావు, రాధాకృష్ణ, కేశబోయిన కోటేశ్వరరావు, బ్రహ్మయ్య, వెంపటి వెంకటేశ్వర్లు, నరసింహారావు, సయ్యద్, సంపత్, చంద్ర కళాధర్, భాగ్యరాజు, పావని, లక్ష్మి, వాహిని తదితరులు పాల్గొన్నారు.






**పాల్వంచ, ములకలపల్లి, లక్ష్మీదేవిపల్లి, చండ్రుగొండ**

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యం....

### మిషన్ భగీరథ పైప్‌లైన్ దెబ్బతిని వృథాగా పారిన మంచినీరు.



**పాల్వంచ,జూలై 20,ప్రభాత వార్త:** పాల్వంచ పట్టణంలోని పోలీస్ పెట్రోల్ బంక్ సమీపంలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో పైప్‌లైన్ నుంచి మంచినీరు ఉవ్వెత్తున ఎగసిపడి పెద్ద ఎత్తున వృథాగా పారింది.డ్రైనేజీ కోసం తవ్వకాలు చేపడుతున్న సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పైప్‌లైన్ పగిలినట్లు స్థానికులు తెలిపారు. సంఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో నీరు భారీగా ప్రవహించగా,ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.పైప్‌లైన్ దెబ్బతినడం వల్ల డ్రైనేజీ నిర్మాణ పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులకు కూడా ఆటంకం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు.వెంటనే మిషన్ భగీరథ అధికారులు,మున్సిపల్ అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.అలాగే డ్రైనేజీ పనులు నిర్వహించే కాంట్రాక్టర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని స్థానికులు సూచిస్తున్నారు.

# పెద్దమ్మతల్లి సేవలో కిలారు ఛారిటబుల్ ట్రస్ట్

### భక్తిశ్రద్ధలతో రథాన్ని బహుకరించిన దాతలు



**పాల్వంచ, ప్రభాతవార్త, జూలై 20:** పెద్దమ్మతల్లి అనుగ్రహంతో సోమవారం పెద్దమ్మతల్లికి నూతన రథాన్ని భక్తిశ్రద్ధలతో బహుకరించారు. ఈ రథాన్ని కిలారు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు సమర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ తరఫున కిలారు బోసు – హైమావతి, డాక్టర్ కిలారు రాజశేఖర్ – ప్రతిమ, రిషిక్, రిషిత (అమెరికా) మరియు శ్రీవెన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించబడింది. పెద్దమ్మతల్లి సేవలో భాగంగా రథాన్ని సమర్పించడం తమకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని దాతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, పెద్దమ్మతల్లి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో పినపాక పట్టినగర్, బూర్గంపహాడ్ మండలానికి చెందిన భక్తులు, గ్రామ పెద్దలు, ట్రస్ట్ సభ్యులు పాల్గొని దాతలను అభినందించారు.

# మధిరలో విద్యార్థులతో శాంతి సేన మానవహారం

మధిర జూలై 20 ప్రభాతవార్త

మహాత్మా గాంధీ శాంతి సేన ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో మానవహారం నిర్వహించారు. ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద లడక్ సామాజిక కార్యకర్త, విద్యావేత్త సోనమ్ వాంగ్చుంగ్ చేపట్టిన నిరాహార దీక్షను బలవంతంగా విరమింపజేయడాన్ని ఖండిస్తూ, పార్లమెంట్ సమావేశాల్లో క్రాక్రోచ్ జనతా పార్టీ ప్రస్తావించిన అంశాలపై సమగ్ర చర్చలు జరగాలని కోరుతూ మధిర పట్టణంలో మహాత్మా గాంధీ శాంతి సేన ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన గాంధీ శాంతి సేన ప్రతినిధులు, విద్యార్థుల సమస్యలు, నీట్ పరీక్షలపై వ్యక్తమవుతున్న ఆందోళనలు, విద్యా వ్యవస్థలో పారదర్శకత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. సోనమ్ వాంగ్చుంగ్ చేపట్టిన నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువతలో చర్చనీయాంశంగా మారిందని, ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టిన నిరసనలకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై



రాజకీయాలకు అతీతంగా చర్చించి, తగిన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు విద్యా రంగంలో నమ్మకం, పారదర్శకత పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నినా దాలు చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకొని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ శాంతి సేన సభ్యులు మొగిలి శ్రీను, బొక్క పుష్పరావు, రావూరి వాసు, కోనేటి సతీష్, అనిల్ కుమార్ పవన్, పండు, స్థానిక విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలి

**- దుద్దిళ్ల శీను బాబు**



**మధిర జూలై 20 ప్రభాతవార్త** ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని ఖమ్మం జిల్లా ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ దుద్దిళ్ల శీను బాబు కోరారు. సోమవారం మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్‌లు, సూపర్‌వైజర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని, ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా మిగిలిపోకుండా ప్రతి ఇంటిని సందర్శించి అవసరమైన ఫారాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇన్‌చార్జ్‌లు, సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేసి ప్రతి ఓటును కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తులుపుల వెంకటేశ్వర్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి అజయ్ మల్లెల, సూపర్‌వైజర్లు వంగవీటి రాజశేఖర్, షేక్ జాకీర్ హుస్సేన్, బిట్రా ఉద్దండయ్య, కమలాకర్, సాలిక సురేష్, దురిశెట్టి జగన్నాథ్, గొల్లమందల శీను దూదేకుల జానీ తదితరులు పాల్గొన్నారు.

# మధిర మండలంలో ట్రైల్ రన్‌గా సీఎం బ్రేక్ ఫాస్ట్

**కృతజ్ఞతలు వ్యక్తం చేసిన విద్యార్థులు**



**మధిర జూలై 20 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయ తలపెట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని సోమవారం మధిరలో లాంఛనంగా ప్రారంభించారు. మధిర మండలం లోని అన్ని పాఠశాలకు సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ఇస్కాన్ టెంపుల్ వారి హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ సుమారుగా మధిర మండలంలోని 53 ప్రభుత్వ విద్యాసంస్థలకు ఈరోజు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ విద్య సంస్థల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని విద్యార్థులకు సీఎం బ్రేక్ఫాస్ట్ ను అందించారు. ప్రభుత్వ అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా దూర ప్రాంతాల నుండి విద్యను అభ్యసించేందుకు వస్తున్న విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థిని విద్యార్థులు విద్యార్థి సంఘాల నాయకులు తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# బోజడ్ల బ్రహ్మమ్మకు నన్నూరి నర్సిరెడ్డి నివాళులు

మధిర జూలై 20 ప్రభాతవార్త



మధిర మున్సిపాలిటీ మున్సిపాలిటీ 16వ వార్డ్ కౌన్సిలర్ వంకాయల పాటి నాగేశ్వరరావు సోదరి బోజడ్ల బ్రహ్మమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృత దేహానికి తెలుగుదేశం పార్టీ జిల్లా కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం గారితో కలిసి తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి గారు నివాళులర్పించారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆమె పరిస్థితి క్షీణించడంతో కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు నర్సిరెడ్డి పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మధిర టౌన్ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు, టిడిపి రాష్ట్ర నాయకులు చేకూరి శేఖర్ బాబు, రావి కోటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర నాయకులు దోమలు సామేలు, టిడిపి సీనియర్ నాయకులు యడవల్లి నాగభూషణం టిడిపి కౌన్సిలర్లు కౌన్సిలర్ ములకలపల్లి వినయ్, కౌన్సిలర్ రేవతి తదితరులు పాల్గొని నివాళులర్పించారు..

# చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

కామేపల్లి, జూలై 20 ప్రభాతవార్త:

కామేపల్లి మండలం పొన్నెకల్లు గ్రామంలో చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల చిక్కా వెంకటేశ్వరరావు మృతి చెందారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని గమనించిన స్నేహితులు 1980 నాటి పదవ తరగతి బ్యాచ్ వారంతా కలిసి అందరి ఆర్థిక సహకారంతో పొన్నెకల్లు గ్రామానికి వచ్చి వారి సతీమణిని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించి 87,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. చిన్ననాటి స్నేహి తుని గుర్తుంచుకొని వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినందుకు గాను గ్రామస్తులంతా వారి స్నేహాన్ని కొనియాడా రు. ఇదే ఐక్యమత్యంతో ఉండాలని కోరారు. తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అం దించినందుకు వారి సతీమణి చిక్కా సత్యమ్మ వారి స్నేహ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆర్థిక సహాయానికి కె. చంద్రమౌళి, విదేశాల్లో ఖతర్ లో ఉంటున్న షేక్ ఖాజా ప్రత్యేక చొరవ తీసు కోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్ర మౌళి, పి. సుధీర్ కుమార్, కనక ప్రసాద్, సూర్యం తదితరులు పాల్గొన్నారు.




# అడ్వాంటా సీడ్స్ సాయంతో జెడ్పీ హైస్కూళ్లకు ల్యాబ్ పరికరాలు

బోనకల్, ప్రభాతవార్త :



ప్రముఖ వ్యవసాయ విత్తన సంస్థ అడ్వాంటా సీడ్స్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోనకల్, రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు సోమవారం భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం, జీవశాస్త్రాలకు సంబంధించిన పూర్తిస్థాయి ల్యాబ్ పరికరాలను అందజేసింది. ఈ సందర్భంగా సంస్థ రీజనల్ మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, సృజనాత్మకత పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సూచన, పర్యవేక్షణలో ల్యాబ్ పరికరాలను వినియోగించి ప్రయోగాల ద్వారా పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోవాలని సూచించారు. ల్యాబ్ పరికరాలు విద్యార్థుల్లో ప్రయోగాత్మక నైపుణ్యాలు, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంలో దోహదపడతాయన్నారు. అనంతరం వెంకటేష్‌ను ఉపాధ్యాయులు సన్మానించి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బోనకల్ ప్రధానోపాధ్యాయులు అట్లూరి గోపీచంద్, రావినూతల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సురేష్, నరసింహారావు, బి. రమేష్, ప్రమీల, సరస్వతి, మంగతాయారు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల రాక కోసం ప్రార్థనలు చేయాలి

**ప్రతి ఒక్కరూ సేవ భావం అలవర్చుకోవాలి పాస్టర్ భక్త సింగ్**

కారేపల్లి జూలై 20 ప్రభాతవార్త



నేడు వర్షా బావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో వర్షాల కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని పాస్టర్ భక్త సింగ్ అన్నారు భక్త సింగ్ అన్నారు. మండల మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో పాస్టర్ బెల్లం సాల్మన్ రాజు ఆధ్వర్యంలో మండల పాస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూదేవుడు మాట వింటే మనము ఆశీర్వదించబడతాం అన్నారు మనుషులను నమ్ముకొనుట కంటే దేవుని నమ్మిన ప్రజలు చరిత్రలో చెడిపోరని తెలిపారు. మన దేశం కొరకు మనమందరము ప్రార్థనలు చేయాలి దేవుని మీద ఆధారపడాలి భయపడాలి అన్నారు. వర్షాల కోసం మనమందరము దేవుని దగ్గర విజ్ఞాపన చేయాలి . రైతులు మంచిగుంటేనే అందరికీ అన్నం లభిస్తుందన్నారు.. రైతన్నలందరినీ దేవుడు దీవించి వర్షం కురవాలని ప్రబోధించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు మధుసూదన్ రావు మండల ప్రెసిడెంట్ ప్రేమ్ సాగర్ సెక్రెటరీ విలియం కేరి గౌరవ అధ్యక్షులు బాబురావు పాల రాజు జాషువా లివిస్టన్ బాలకృష్ణ సువర్ణ రాజు జకరయ్య ఎం బాబురావు శాంతయ్య ఉపేందర్ శ్యాంసుందర్ జయరాజ్ లాజరస్ కరుణాకర్ అశోక్ ఆనందరావుమోజస్ జాన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

ఆళ్లపల్లి20జులై ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమ వారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి తాళ్లపల్లి వినయ్ విద్యార్థుల సమస్యలు, విద్యా హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ, దేశంలోనూ రాష్ట్రంలోనూ ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించు కోవడానికి విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, గురుకుల విద్యా సంస్థలకు సొంత భవనాలు నిర్మించాలని, ఎంఈఓ, డీఈఓ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వం మరియు సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు దుస్తులు, కాస్మోటిక్ కిట్లు అందించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎస్.కే. ఆరిఫ్, కీసరి శివ పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లా టి.ఐ.సి.సి.ఐ ప్రధాన కార్యదర్శిగా ధర్మసోత్ సీతారాం నాయక్ నియామకం.

పాల్వంచ టౌన్,జూలై 20 (ప్రభాత వార్త):



ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టి.ఐ.సి.సి.ఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధర్మసోత్ సీతారాం నాయక్‌ను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా.శ్రీనివాస్ ధారావత్ నియమించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డా.శ్రీనివాస్ ధారావత్ మాట్లాడుతూ,గిరిజన యువత,మహిళా పారిశ్రామికవేత్తలు,స్వయం ఉపాధి కోరుకునే లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, రుణాలు,సబ్సిడీలు,నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు,స్టార్టప్ అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు గిరిజన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా సమన్వయం చేసే బాధ్యతను సీతారాం నాయక్‌కు అప్పగించడం సంతోషకరమని తెలిపారు.ధర్మసోత్ సీతారాం నాయక్ తన సేవా దృక్పథం,నాయకత్వ లక్షణాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజన పారిశ్రామికవేత్తల అభివృద్ధికి విశేష కృషి చేస్తారనే పూర్తి విశ్వాసం తమకు ఉందన్నారు.గిరిజనుల ఆర్థిక సాధికారత,ఉపాధి అవకాశాల విస్తరణ,పారిశ్రామికాభివృద్ధి, ప్రభుత్వ పథకాల సద్వినియోగం కోసం టి.ఐ.సి.సి.ఐ నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ నియామకంతో జిల్లాలో గిరిజన పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం లభించి,ప్రభుత్వ పథకాల అమలులో సమర్థవంతమైన సమన్వయం ఏర్పడుతుందని సంస్థ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# 70 ఏళ్ల హమాలీల అడ్డాపై బెదిరింపులా..?

- .ఆమ్ బజార్‌లో హమాలీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి
- .ఆర్‌కే ఫ్యాషన్స్ ఏసీ వ్యర్థ నీటితో బురదమయమైన రహదారి
- .ప్రశ్నించిన హమాలీలపై దురుసు ప్రవర్తన
- .అడ్డా లేకుండా చేస్తా అంటూ వ్యాపారి బెదిరింపులు
- .ఎమ్మెల్యే కోరం కనకయ్యకు హమాలీల ఫిర్యాదు



**ఇల్లందు, జూలై 20, ప్రభాతవార్త:** ఇల్లందు పట్టణంలోని ప్రధాన వ్యాపార కేంద్రమైన ఆమ్ బజార్‌లో దశాబ్దాలుగా జీవనోపాధి సాగిస్తున్న హమాలీలు తమ అడ్డాను కాపాడాలని కోరుతున్నారు. సుమారు 70 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో హమాలీల అడ్డా కొనసాగుతుండగా,ఆ అడ్డాను తొలగిస్తానంటూ ఓ వస్త్ర దుకాణం వ్యాపారి బెదిరించాడని హమాలీలు ఆరోపించారు. హమాలీల మాట్లాడుతూ ప్రకారం, ఆమ్ బజార్‌లోని ఆర్‌కే ఫ్యాషన్స్ దుకాణం ఏసీ నుంచి వస్తున్న వ్యర్థ నీరు నేరుగా రహదారిపై పడు తుండటంతో రోడ్డు బురదమయంగా మారింది. దీంతో ప్రతిరోజూ అక్కడే కూలి పనుల కోసం వేచి ఉండే హమాలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఈ సమస్యను పలుమార్లు వ్యాపారి దృష్టికి తీసుకెళ్లి, నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ స్పందన లేదని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం మరోసారి సమస్యను ప్రస్తావించగా, వ్యాపారి తమతో దురుసుగా ప్రవర్తించడంతో పాటు "మీ అడ్డా లేకుండా చేస్తా... ఈ స్థలం మీకు ఎలా వచ్చిందో చూస్తా" అంటూ బెదిరించినట్లు హమాలీలు ఆరోపించారు. అంతేకాకుండా, "ఎవరికైనా చెప్పుకోండి" అంటూ అవమాన కరంగా మాట్లాడినట్లు వారు పేర్కొన్నారు. తమ తాతలు, ముత్తాతల కాలం నుంచే ఆమ్ బజార్‌లో హమాలీల అడ్డా కొనసాగు తోందని, అదే తమ కుటుంబాలకు జీవనాధారమని హమాలీలు తెలిపారు. అలాంటి అడ్డాపై ప్రశ్నలు లేవనెత్తడం, బెదిరింపులకు పాల్పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేసి తమపై చర్యలు తీసుకుంటానంటూ హెచ్చరించాడని కూడా హమాలీలు ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి తమకు న్యాయం చేయాలని, దశాబ్దాలుగా కొనసాగుతున్న హమాలీల అడ్డాను పరిరక్షించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. హమాలీల జీవనోపాధికి భంగం కలగకుండా సంబంధిత అధికారులు, మున్సిపల్ అధికారులు సమస్యను పరిశీలించి, రహదారిపైకి వ్యర్థ నీరు చేరకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఇరువర్గాల మధ్య నెలకొన్న వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమ వెంచర్లు..

### చర్యలకు పంచాయతీ సిద్ధం



**లక్ష్మీదేవిపల్లి, జూలై 20 ప్రభాతవార్త:** లక్ష్మీదేవిపల్లి, మండలం సాటివారి గూడెం గ్రామపంచాయతీ పరిధిలో అనధికారికంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారనే అంశంపై ఇటీవల




వార్తాపత్రికలో ప్రచురితమైన "1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తున్న అక్రమ వెంచర్లు" కథనానికి పంచాయతీ కార్యదర్శి స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలోనే సంబంధిత ప్రాంతంలో ఎలాంటి వెంచర్లు ఏర్పాటు చేయరాదని గ్రామపంచాయతీ తరపున సర్పంచ్, ఉపసర్పంచ్‌లతో కలిసి హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఫ్లెక్సీని తొలగించి, మళ్లీ అనుమతులు లేకుండా వెంచర్ల ఏర్పాటు కు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ వ్యవహారాన్ని గ్రామ పంచాయతీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్న కార్యదర్శి, అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్న వారికి త్వరలోనే నోటీసులు జారీ చేస్తామని వెల్లడించారు. అనుమతులు లేకుండా లేఅవుట్లు, ప్లాట్ల విక్రయాలు చేపడితే సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించి, వారి ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు కూడా ఇలాంటి అనుమతులు లేని వెంచర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, భూములు కొనుగోలు చేసే ముందు సంబంధిత శాఖల అనుమతులు, రికార్డులు తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి దిష్టిబొమ్మ దగ్ధం

### నీట్ పేపర్ లీక్ పై బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలి

**కొత్తగూడెం టౌన్, జూలై 20 ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీకుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ తో చర్చలు జరిపి దీక్షను విరమింప చేసేలాగా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఢిల్లీలో బిజెపి, విద్యార్థి సంఘాలు తలపెట్టిన పార్లమెంటు ర్యాలీ మరియు ధర్నాకు సంఘీభావం తెలుపుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లా డుతూ... గత ఐదైదు మూడు రోజుల నుండి సామాజిక కార్యకర్త వాంగ్ చుక్ నిరాహార దీక్ష చేస్తుంటే కనీసం ప్రభుత్వం స్పందించకపోగా బలవంతంగా దీక్షను భగ్నం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు నిరసన తెలియజేసే హక్కు రాజ్యాంగం కల్పిస్తే రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా ప్రజాస్వామ్య హక్కులను నిర్బంధంతో మోదీ ప్రభుత్వం కాల రాస్తోందని దుయ్యబట్టారు. ఢిల్లీలో శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై



లాఠీచార్జి బాసువవాయువు వాటర్ కెనాల్ వంటివి ఉపయోగించి ఉద్యమాన్ని నిర్బంధంతో నిలిపివేసే కుట్రలు చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మీ నందిపాటి రమేష్ నాయకులు విజయగిరి శ్రీనివాస్ ఎం ఎస్ ప్రకాష్ గడల నరసింహారావు రమేష్ బాబు బాలకృష్ణ రాములు రఘు తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

**ఆగస్టు 6 నుండి సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్రలు**

**నగర కమిటీ సమావేశంలో దండి సురేష్**

ప్రభాతవార్త గాంధీ చౌక్ జులై 20

ప్రజా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం అవుతాయని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఆందోళన చేపట్టగా తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ స్పష్టం చేశారు. ప్రజా పోరాటాలకు ప్రజలను సన్మార్గం చేయాలన్నారు సిపిఐ నగర కమిటీ సమావేశం సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. వరద నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ పట్టణాల్లో మౌలిక వసతులు కల్పన, పేదలకు నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడంలో కొంత వివక్షత నెల కొన్నది అన్నారు. రెండు దశాబ్దాలుగా పట్టణీకరణ అత్యంత వేగంగా జరిగిందని అందుకు




అనుగుణంగా మౌలిక వసతుల కల్పన జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాల్లో నివసిస్తున్న వేదలు సరైన ఉపాధి అవకాశాలు లేక నివాస స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పట్టణ పేదలను సమీకరించి సమస్యల పరిష్కారానికి సిపిఐ కృషి చేస్తుందని ఆయన తెలియజేశారు. గత ప్రభుత్వం బిపిఎల్ ద్వారా నివాస స్థలాలను ఇచ్చేందుకు నిరాకరించి ఆ జీవోను సైతం రద్దు చేసిందని పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ రెండున్నర ఏళ్ళు గడుస్తున్న నేటికీ ఆ పని చేయలేదని దండి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలు కూడా సరైన రీతిలో జరగడం లేదని పింఛన్ల పెంపుతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 15 వరకు జిల్లాల్లో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐదు నియోజకవర్గాల పరిధిలో పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి పోరాట కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి ఎస్కె జానీ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మహమ్మద్ సలాం, బిజీ క్లైమేట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివ రెడ్డి, ఏనుగు గాంధీ, ఏ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాన్న బాల రామకృష్ణ, జిల్లా కౌన్సిలింగ్ సభ్యులు తాటి నిర్మల, ఎస్కె సైదా, జాకీర్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలు వెంటనే పరిష్కారించాలి

**అధికారులకు మంత్రి తుమ్మల అదేశం**

ఖమ్మం అర్బన్, జులై 20(ప్రభాత వార్త)



ప్రజల సమస్యలను వెంటనే పరిష్కారించాలని అధికారులకు వ్యవసాయ శాఖ తుమ్మల నాగేశ్వరరావు అదేశించారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల నుండీ వచ్చిన వినతి పత్రాలు స్వీకరించి తక్షణమే అధికారులను ఆదేశించి పరిష్కారం చేయాలని సూచించారు అదేవిధంగా త్రీ టౌన్ ఏరియా కు సంబంధించిన సమస్యలను తీసుకొని వచ్చిన స్థానిక నాయకులు, ప్రజల నుంచి వినతులను తీసుకొని తక్షణ పరిష్కార మార్గాన్ని సూచించారు. అనంతరం గుంటు మల్లేశ్వర స్వామీ వారి (శివాలయానికి) దేవస్థానం నకు సంబంధించిన ఆలయం కమిటీసభ్యులు గౌరవ మంత్రివర్యులను మర్యాదపూర్వకంగా కలిసారు నాలుగో డివిజన్ సంబంధించిన నాయకులు, ఖమ్మం ఆటో యూనియన్ నాయకులు వచ్చి మంత్రి కలిసి వారి సమస్యను తెలిపినారు వారి సమస్యలను పరిష్కరిస్తానని వాళ్లకు తెలిపినారు.

# నాణ్యత లేని పాదరక్షల విక్రయం..

# సెంట్రో షోరూమ్‌కు వినియోగదారుల కమిషన్ ఆదేశాలు

**కొనుగోలు ధరతో పాటు రూ.10 వేల పరిహారం చెల్లించాలని ఆదేశం**

ఖమ్మం టౌన్, ప్రభాతవార్త జూలై 20:

నాణ్యత లేని పాదరక్షలను విక్రయించి వినియోగదారుడికి ఇబ్బందులు కలిగించిన సెంట్రో షోరూమ్‌పై ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కీలక తీర్పు వెలువరించింది. పాదరక్షల కొనుగోలు ధరతో పాటు మానసిక వేదనకు పరిహారం, వ్యాజ్య ఖర్చులు కలిపి మొత్తం రూ.11,599 చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. కమిషన్ చైర్మన్ వి. లలిత, సభ్యురాలు ఎ. మాధవీలత ఈ మేరకు తీర్పు ఇచ్చారు. కేసు వివరాల ప్రకారం, వైరా మండలం తాటిపూడి గ్రామానికి చెందిన లింగాల ప్రవీణ్ కుమార్ ఖమ్మం జిల్లా కోర్టులో న్యాయవాద క్లర్క్‌గా పనిచేస్తున్నారు. కోర్టు సమీపంలోని సెంట్రో షోరూమ్‌లో 2025 ఆగస్టులో ప్రకటనలకు ఆకర్షితుడై రూ.1,599 విలువైన పాదరక్షలను కొనుగోలు చేశారు. అయితే వాటిని కేవలం రెండు మూడు సార్లు మాత్రమే ఉపయోగించగానే సోల్ దెబ్బతిని మధ్యలో పగిలిపోయింది. దీంతో షోరూమ్‌ను సంప్రదించి పాదరక్షలను మార్చివ్వాలని లేదా చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా యాజమాన్యం స్పందించకపోవడంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారుడి తరఫున న్యాయవాదులు వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్, కొలికొండ శరత్ బాబు, తోట రామాంజనేయులు వాదనలు వినిపించారు. వాదనలు, ఆధారాలను పరిశీలించిన కమిషన్.. సెంట్రో షోరూమ్ సేవల్లో లోపం (Deficiency in Service) ఉన్నట్లు, నాణ్యత లేని వస్తువును విక్రయించినట్లు నిర్ధారించింది. ఫలితంగా పాదరక్షల కొనుగోలు ధర రూ.1,599 తిరిగి చెల్లించడంతో పాటు మానసిక వేదన, అసౌకర్యానికి రూ.5,000, వ్యాజ్య ఖర్చులకు మరో రూ.5,000 చెల్లించాలని, మొత్తం 45 రోజులలోపు ఫిర్యాదుదారునికి అందజేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా కమిషన్ కీలక వ్యాఖ్యలు చేసింది. వినియోగదారులను ఆకర్షించే ప్రకటనలతో నాణ్యత లేని వస్తువులను విక్రయించడం వినియోగదారుల హక్కులకు విరుద్ధమని, వినియోగదారుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించని వ్యాపార సంస్థలపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. ఈ తీర్పు నాణ్యత లేని ఉత్పత్తులు విక్రయించే వ్యాపార సంస్థలకు హెచ్చరికగా నిలుస్తుందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (ఎన్ డి డి )మోప్‌అప్ డే

ఖమ్మం వైద్య విభాగం, జూలై 20(ప్రభాత వార్త )

ఖమ్మం నగర పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని క్షేత్రస్థాయిలో పరిశీలించిన డీఎంహెచ్ఓ డాక్టర్ డి. రామారావు, జిల్లా వ్యాప్తంగా పిల్లల్లో నట్టల నివారణే ధ్యేయంగా నిర్వహిస్తున్న, జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం, (నేషనల్ డెవర్మింగ్ డే ఎన్ డి డి ) మోప్‌అప్ కార్యక్రమాన్నిడాక్టర్ డి. రామారావు, సోమవారం నాడు క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఖమ్మం నగర పరిధిలోని రస్తోగి నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మరియు ఎన్.ఎస్.సి. కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను, ఆయన సందర్శించారు. గత వారం నిర్వహించిన ప్రధాన విడతలో వివిధ కారణాల వల్ల, ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోలేకపోయిన విద్యార్థులకు, ఈ రోజు మోప్‌అప్ డే సందర్భంగా టీచర్లు, ఆరోగ్య సిబ్బంది సమక్షంలో మాత్రలు వేయించే ప్రక్రియను డీఎంహెచ్ఓ స్వయంగా పర్యవేక్షి ంచారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ డి. రామారావు గారు మాట్లాడుతూ, రక్తహీనత నివారణ: పిల్లల కడుపులో ఉండే నులిపురుగులు వారు తినే ఆహారంలోని పోషకాలను హరించి వేస్తాయని, దీనివల్ల పిల్లలు రక్తహీనత మరియు పోషకాహార లోపానికి గురవుతారని తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని వివరించారు. 100!! లక్ష ్యం సాధించాలని, జిల్లాలోని 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు వయసున్న ప్రతి ఒక్క పిల్లవాడికి ఈ మాత్రలు అందేలా వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ మరియు అంగన్‌వాడీల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. బడి బయట, పిల్లలకు కూడా కవర్ చేసేలా సిబ్బంది కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచన, మాత్రలను నమిలి మింగేలా చూడాలని, ఖాళీ కడుపుతో కాకుండా భోజనం లేదా అల్పాహారం చేసిన తర్వాతే వేయించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, స్థానిక పట్టణ మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా వివేకానంద సేవా సమితి చైర్మన్ శ్రీ మోత్కూరి నారాయణరావు జన్మదిన వేడుకలు

ఖమ్మం వైద్య విభాగం, జులై 20(ప్రభాత వార్త )



సోమవారం ఖమ్మం నగరంలో ఖమ్మం జిల్లా వివేకానంద సేవా సమితి చైర్మన్ శ్రీ మోత్కూరి నారాయణరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రక్ష హాస్పిటల్ అధినేత, భారతీయ జనతా పార్టీ తెలంగాణ కార్యవర్గ సభ్యులు డా. శ్రీ గోంగూర వెంకటేశ్వర్లు (డాక్టర్ జీ.వీ ), భారతీయ జనతా పార్టీ తెలంగాణ కార్యవర్గ సభ్యులు శ్రీ రుద్ర ప్రదీప్ కలిసి నారాయణరావుకి గజమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీ మోత్కూరి నారాయణరావు సమాజ సేవను లక్ష ్యంగా చేసుకొని ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని, ఆయురారోగ్యాలతో, ఆనంద సంతోషాలతో నిండి మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో డా. షేక్ ఏడుకొండలు, రుద్ర ప్రతాప్, రాకేష్ దత్త, పిల్లలమర్రి వెంకట్, శ్యామ్, జగన్, ఊరుకొండ ఖాదర్ బాబు, గజ్జల శ్రీనివాస్, రిహాబ్ బుద్ధ, శ్రీ రక్ష హాస్పిటల్ బృందం సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని నారాయణరావుకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా యువ మోర్చా అధ్యక్షులుగా శాసనాల సాయిరాం

ప్రభాతవార్త గాంధీ చౌక్ జులై 20.



భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా యువ మోర్చా అధ్యక్షులుగా శాసనాల సాయిరాం ను నియమిస్తూ భారతీయ జనతా పార్టీ తెలంగాణ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుందే గణేష్ సోమవారం నాడు ఆదేశాలు జారీ చేశారు. శాసనాల సాయిరాం విద్యార్థి దశ నుండి పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై, క్రమశిక్షణ గల కార్యకర్తగా పని చేస్తూ, అంచలంచెలుగా ఎదుగుతూ ఈరోజు జిల్లా అధ్యక్షులుగా నియమితులైనారు. ఈ సందర్భంగా శాసనాల సాయిరాం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పినందుకు రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షులు కుందే గణేష్ కి, మరియు జిల్లా బిజెపి అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన ఈ బాధ్యతకు పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం అహర్నిశలు కష్టపడి పని చేస్తానని తెలియజేశారు.

## వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**మణుగూరు ఏరియా ఏజీఎం (పర్సనల్ )ఎస్.రమేష్**

**మణుగూరు, ప్రభాతవార్త, జులై 20:**

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా పి.వి. కాలనీలో మహిళలు, నిరుద్యోగ యువతీ యువకులకు పలు వృత్తి విద్యా కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ డిటిపి, మగ్గం వర్క్స్, క్లాత్, జ్యూట్,బంజారా బ్యాగ్స్ తయారీ, ఫోటోషాప్, మల్టీమీడియా కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని, శిక్షణ పూర్తయి పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ హైదరాబాద్ వారిచే ధృవీకరణ పత్రాలు అందజేస్తారు.ఆసక్తి గల సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులు, మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులు, స్థానిక నిరుద్యోగులు తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తుకు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో జతచేసి, ఈ నెల 30వ తేదీ లోపు మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం పర్సనల్ విభాగంలో అందజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## నూతన గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేయండి

**అశ్వాపురం,ప్రభాతవార్త, జూలై 20;**

అశ్వాపురం మండలంలోని నెల్లిపాక గ్రామ పంచాయతీ కి నూతన భవనం మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నెల్లిపాక సర్పంచ్ ముంద్రు వెంకట రామకృష్ణ జిల్లా పంచాయతీ అధికారిణి శిరీష కు వినతిపత్రాన్ని అందచేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామ పంచాయతీ కార్యాలయం 1980 వ దశకంలో నిర్మించిందని ఇప్పుడు ఆది పూర్తిగా శిథిలమయ్యిందని,ఎప్పుడు కూలుతుందో అర్థం కావట్లేదన్నారు.రెండు సార్లు గోదావరి నదికి వచ్చిన భారీ వరదల సందర్భంగా పూర్తిగా మునిగి పోయిందని,ఈ శిథిలావస్థలో ఉన్న భవనం నుండి గ్రామ పంచాయతీ కార్యకలాపాలు నిర్వహించలేక పోతున్నామని,సున్నం,బ్లీచింగ్ వంటివి నిల్వ చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.వర్షాకాలం వర్షం వచ్చిందంటే



వర్షపు నీళ్లు మొత్తం స్లాబు శిథిలమై కార్యాలయ గదుల్లో కురుస్తున్నాయన్నారు.గ్రామ పంచాయతీ పరిపాలనా కార్యక్రమాల దృష్ట్యా తక్షణమే తమకు నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి కి వినతిపత్రాన్ని అందచేశామని తెలియచేశారు.అలాగే గ్రామ పంచాయతీ లోని వద్దిపర్తి శ్రీనివాసరావు జీవో నెంబర్ 59 ద్వారా ఇంటి స్థలం రెగ్యులైజేషన్ కొరకు దరఖాస్తును అందచేశామని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో నెల్లిపాక మాజీ సర్పంచ్ గొర్రెముచ్చు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు

## పూడిక తీత పనులు చేపట్టాలి

**మణుగూరు ఏరియా జీఎం కు పగిడేరు రైతులు వినతి**

**మణుగూరు, ప్రభాతవార్త, జూలై 20:**

సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల త్రవ్వకాల మట్టి, ఒండ్రు కొట్టుకువచ్చి గొర్రెపేట వాగు, చెక్ డ్యాం, ఊర చెరువుల్లో పూడిక పేరుకుపోయిందని, తక్షణమే పూడిక తీత పనులు చేపట్టాలని కోరుతూ పగిడేరు గ్రామ రైతులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సోమవారం మణుగూరు ఏరియా సింగరేణి జీఎంకు వినతిపత్రం అందజేశారు. కాలువలు పూడిపోవడం వల్ల వర్షాకాలంలో పంట పొలాలు ముంపునకుగురవుతున్నాయని, వేసవిలో సాగునీటికి తీవ్ర ఇబ్బందులుతలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీ ఎస్ఆర్ నిధులతో యుద్ధప్రాతిపదికన పూడిక తీయించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పగిడేరు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ల జారీ జాప్యం లేకుండా చూడాలి

**.పినపాక, ప్రభాత వార్త, జులై 21**

.మండల పరిధిలోని రెవిన్యూ సంబందించిన అర్జీదారులకు సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు గోగ్గల రామకృష్ణ దొర ఉన్నత అధికారులను కోరారు. ఈ సందర్బంగా అయన సోమవారం మాట్లాడుతూ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ సెలవులో ఉండటంతో విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ లు,అర్జీదారులకు జారిలో ఆలస్యమవుతోందని అన్నారు.సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి డిప్యూటీ తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పగించాలని కోరారు.విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు అందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీను, మండల కార్యదర్శి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూలిన పూరి గుడిసె. నిరాశ్రయులైన పేద కుటుంబం.



**పినపాక, ప్రభాత వార్త, జులై 21**

.మండల పరిధిలోని పెంటన్నగూడెం గ్రామనికి చెందిన సల్లూరి రామచంద్రయ్య నివాసం ఉంటున్నా పూరి గుడిసె సోమవారం కురిసిన వర్షానికి కూలిపోయింది. ఘటన సమయంలో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. కాని ఇంట్లోని బట్టలు,రేషన్ సామగ్రి, నిత్యావసర వస్తువులు పూర్తిగా తడిసి పాడయ్యాయి. నివాసం ఉంటున్న ఇల్లు కూలడంతో సర్వస్వం కోల్పోయిన ఆ కుటుంబం ప్రస్తుతం నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పోడు భూముల వివాద ఘటనా స్థలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్,

**అశ్వాపురం,ప్రభాతవార్త జూలై 20:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలంలోని మనుబోతులగూడెంలో పోడు భూముల వివాదం నెలకొని అటవీ శాఖ అధికారులకు,గిరిజనులకు మధ్య ఘర్షణలు జరిగిన నేపథ్యంలో గురువారం అటవీశాఖ సిబ్బంది, ఆదివాసుల మధ్య చోటుచేసుకున్న ఘటనపై అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ,జిల్లా అటవీశాఖ అధికారి విక్రమ్ సింగ్,ఐటీడీఏ పీవో రాహుల్,ఎఫ్‌డీవో బాబు తదితర అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు.స్థానిక సర్పంచ్‌తో పాటు గ్రామస్థుల నుంచి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోడు భూముల సమస్య, అటవీ భూముల పరిరక్షణ, ఆదివాసుల జీవనాధారాలకు సంబంధించిన అంశాలపై అధికారులు సమగ్రంగా సమాచారం సేకరించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, వాస్తవాలను పరిశీలించి, అవసరమైన నివేదికను సిద్ధం చేయనున్నట్లు సమాచారం.ఇట్టి విషయంపై బుధవారం ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయంలో విచారణ చేపట్టనున్నట్లు ఈ రోజు తగిన ఆధారాలతో పోడు దారులు హాజరు కావాలని తెలిపారు.అటవీ అధికారుల ను విచారించిన తెలుసుకున్న సర్దార్ విక్రమ్ సింగ్ మణుగూరు అటవీశాఖ కార్యాలయానికి విచ్చేసిన జిల్లా అటవీ శాఖ అధికారి సర్దార్ విక్రమ్ సింగ్ వివాదానికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను విచారణ జరిపి సమాచారం తీసుకున్నారు.గత సంవత్సర కాలంగా ఘటనా స్థలానికి సంబంధించిన పోడు భూమి వివరాలను,ఘర్షణ జరిగిన రోజు 17 వ తారీఖు అసలు ఏమి జరిగింది,వాగ్వాదం ఎలా నెలకొంది,ఘర్షణలో ఎవరెవరికి గాయాలైనవి,ఆ ప్రాంతానికి సమాచారం ఇచ్చి వెళ్ళారా,లేదా ఎటువంటి సమాచారం లేకుండా వెళ్ళారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.




## మణుగూరులో రైతులకు అవగాహన

**మణుగూరు, ప్రభాతవార్త, జూలై 20:**

మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో కోఆపరేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఆర్ఆర్ ) సౌజన్యంతో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిపుణులు పంట మార్పిడి విధానాలు, నేల పరీక్షల (సాయిల్ టెస్ట్) ప్రాముఖ్యత, సహకార సంఘాల సమర్థవంతమైన నిర్వహణపై వివరంగా అవగాహన కల్పించారు. భూసారాన్ని కాపాడుకోవడానికి పంట మార్పిడి, దిగుబడి పెంచుకోవడానికి నేల పరీక్షలు తప్పనిసరి అని సూచించారు. సొసైటీకి 10 నేల పరీక్షల పరికరాల కిట్లను అందజేస్తూ, ఉత్సాహమున్న రైతులు వీటిని వినియోగించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాక్స్ మణుగూరు చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, డీ ఐ సీ డిస్ట్రిక్ట్ ఇంచార్జి రాజయ్య, డోమైన్ ఎక్స్‌పర్ట్స్ డా. కవిరాజు, అరుంధతి, ఏఈవో లక్ష్మణ్ రావు, సొసైటీ సీఈఓ కొంపెల్లి సునీల్, సిబ్బంది గుంటుపల్లి రాఘవులు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ జేఏసీ నిరసన

**మణుగూరు, ప్రభాతవార్త, జూలై 20:**

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లోని స్టేజ్1, స్టేజ్2లకు సంబంధించిన యాష్, కోల్ ప్లాంట్లను ప్రైవేటీకరించే ప్రతిపాదనలను నిరసిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం బీటీపీఎస్ ప్రధాన గేటు ఎదుట నిరసనతెలిపారు .యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ప్లకార్డులతో ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ రీజినల్ కన్వీనర్ ఎస్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత పాతిక రోజులుగా ఆందోళనలు చేస్తున్నా వైటీపీఎస్ ప్రైవేటీకరణపై యాజమాన్యం ముందుకెళ్లడం శోచనీయమన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజీపీఈఏ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి బి.రవిప్రసాద్, టీఎస్ఈఏఈఏ నాయకులు సి.హెచ్.రవితేజ, మహేష్, 1535 సంఘం రీజనల్ అధ్యక్షుడు వి.ప్రసాద్, 1104 నాయకుడు ఎ.వెంకట్రామ్, 327 రీజనల్ అధ్యక్షుడు బి.కృష్ణ, ఏఐటీయూసీ నాయకుడు శోభన్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ రీజినల్ ప్రెసిడెంట్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**.పినపాక, ప్రభాతవార్త, జూలై 21.**

కష్టకాలంలో తోటి మిత్రునికి సహాయం అందించి స్నేహానికి నిలువెత్తు నిదర్శనం చాటుకున్నారు ఏదుల్ల బయ్యారం ఇంటి యజమానుల వర్తక సంఘం సభ్యులు. ఏదూళ్ళ బయ్యారం క్రాస్ రోడ్డులో శ్రీ బాలాజీ ఫ్లెక్స్ ప్రింటింగ్ షాప్ నిర్వాహకుడు సిరిగడ్డే సంతోష్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడి ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఏదూళ్ళ బయ్యారం క్రాస్‌రోడ్ ఇంటి యజమానులు,వర్తక సంఘం సభ్యులు ఆధ్వర్యంలో స్నేహితులు,దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయన్ని అందిస్తూ అందరి సహకారంతో సుమారు 70,000 రూపాయలు సేకరించి సంతోష్ వైద్య ఖర్చుల నిమిత్తం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో మనలో ఒకరికి మనమంతా అండగా నిలవాలనే సంకల్పంతో ఈ సహాయ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు దాతలు తెలిపారు.ఒక్కొక్కరి చిన్న సహాయం కలిస్తే ఒక కుటుంబానికి పెద్ద భరోసాగా మారిందన్నారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఇంటి యజమానికి, ప్రతి వ్యాపారికి,ప్రతి దాతకు, ప్రతి మిత్రుడికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదేవిదంగా సంతోష్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ అందరి మధ్యకు రావాలని వారు ఆకాంక్షించారు.

# ఏజెన్సీ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

## ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటు చేయాలని

## ఎమ్మెల్యే కోరం కనకయ్యకు విజ్ఞప్తి

## పక్షవాతం, స్ట్రోక్ బాధితులకు స్థానికంగానే

## చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలి





**ఇల్లందు, జూలై 20, ప్రభాతవార్త:** సమాజ సేవనే ధ్యేయంగా, పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాదావత్ రవి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని ప్రజా ఆరోగ్య సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రావాలంటే ఇల్లందులో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ, ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలు, గిరిజన తండాలు ఇప్పటికీ సరైన వైద్య సదుపాయాలకు దూరంగా ఉన్నాయని తెలిపారు. పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్, ప్రమాదాల కారణంగా అవయవాల పనితీరు కోల్పోయిన వారు, వికలాంగులు, వృద్ధులు సరైన ఫిజియోథెరపీ చికిత్స అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి బాధితులకు సమీపంలోనే ప్రత్యేక ఫిజియోథెరపీ కేంద్రం ఉంటే వారి జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని వివరించారు. మిషన్ వాక్ ఫౌండేషన్ ప్రారంభించినప్పటి నుంచి వేలాది మంది పక్షవాత బాధితులు, వికలాంగులు, బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ అనంతరం నడవలేని స్థితికి చేరుకున్న వారికి పునరావాస సేవలు అందిస్తూ సాధారణ జీవితానికి చేరువ చేస్తున్నామని తెలిపారు.

### గ్రామాలకే వెళ్లి బాధితులను గుర్తిస్తున్న మిషన్ వాక్ ఫౌండేషన్

డాక్టర్ రవి నేతృత్వంలోని మిషన్ వాక్ బృందం ప్రస్తుతం గ్రామ గ్రామానికీ వెళ్లి, ఇంటింటికీ చేరుకుని పక్షవాత బాధితులు, వికలాంగులు, బ్రెయిన్ స్ట్రోక్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తోందన్నారు. అవసరమైన వైద్య సలహాలు, ఫిజియోథెరపీ మార్గదర్శకాలు అందించడంతో పాటు చికిత్స అవసరమైన వారికి తదుపరి వైద్య సహాయం అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేక చాలామంది చికిత్సకు దూరమవుతున్నారని, సమయానికి ఫిజియోథెరపీ అందక జీవితాంతం మంచానికే పరిమితమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లందులో సమగ్ర ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటైతే గిరిజనులు, బడుగు, బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని, ఖమ్మం లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి స్థానికంగానే నాణ్యమైన చికిత్స పొందే అవకాశం కలుగుతుందని వివరించారు. ఈ ప్రతిపాదనను ఎమ్మెల్యే కోరం కనకయ్య సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వ సహకారంతో ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయాలని డాక్టర్ రవి కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే నిజమైన అభివృద్ధికి పునాదని పేర్కొంటూ, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, వైద్య నిపుణులు, సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ కలిసి పనిచేస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య విప్లవం సాధ్యమవుతుందని అన్నారు. "సేవే మా మార్గం... ప్రతి గ్రామానికి చేరుకోవడం మా లక్ష్యం... ప్రతి బాధితుడి జీవితంలో ఆశ వెలుగు నింపడమే మిషన్ వాక్ ఫౌండేషన్ ధ్యేయం" అని డాక్టర్ బాదావత్ రవి పేర్కొన్నారు

# వినతులను త్వరితగతిన పరిష్కరించాలి

## గ్రీవెన్స్ లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్





**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 20 ప్రభాతవార్త:** జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ప్రజల నుండి అందిన వినతులు, ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, జిల్లా గృహనిర్మాణ సంస్థ (హౌసింగ్) ప్రాజెక్టు డైరెక్టర్‌తో కలిసి స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి వినతిని సకాలంలో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయంతో పనిచేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే వినతులను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించి దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని వినతులు: కొత్తగూడెంకు చెందిన గుగులోతు కృష్ణకుమారి తన తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం కోసం రెండు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదని విన్నవించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన అదనపు కలెక్టర్ తదుపరి చర్యల కోసం కొత్తగూడెం ఆర్డీవోకు ఎండార్స్ చేశారు. సారపాక గాంధీనగర్ గ్రామపంచాయతీకి చెందిన తన్నీరు నాగదేవి ధరణి సర్వే సమయంలో తన ఇంటి పన్ను అంచనా విలువ పొరపాటున సున్నా గా నమోదైందని, దీంతో ఇంటి పన్ను విధించడం లేదని తెలిపారు. ఇంటి పన్ను రసీదు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు తదితర సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇంటి పన్ను అంచనాను సరిచేసి పన్ను చెల్లించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ వినతిపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం రొంపేడు గ్రామపంచాయతీకి చెందిన భాగ్యలక్ష్మి తాను ఎం.ఏ., బి.ఎడ్. పూర్తి చేసినప్పటికీ ఉపాధి లేక కుటుంబ పోషణ కష్టంగా మారిందని, తగిన ఉపాధి కల్పించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తదుపరి చర్యల కోసం జిల్లా ఉపాధి కల్పన అధికారికి ఎండార్స్ చేశారు. జూలూరుపాడు మండలం మాచినేనిపేట గ్రామానికి చెందిన రవీందర్ సర్వే నంబర్ 228/2లో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదని, ఈ వినతిని పరిశీలించిన అదనపు కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని జూలూరుపాడు తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.




## ఇల్లెందు, గుండాల, టేకులపల్లి

# ఫేక్ ఫోన్ పే లావాదేవీతో నగల దుకాణంలో చోరీ

**జూలూరుపాడు, ప్రభాతవార్త, జూలై 20:**



మండల కేంద్రంలోని ఓ నగల దుకాణంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి బంగారం కొనుగోలు చేసినట్లు నటించి ఫేక్ ఫోన్ పే లావాదేవీతో చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం సాయం త్రం సమయంలో జరిగింది. దుకాణం నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం ఓ గుర్తు తెలియని వ్యక్తి దుకాణానికి వచ్చి బంగారు నగలు కొనుగోలు చేసినట్లు నటించి, ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించినట్లు నకిలీ (ఫేక్) లావాదేవీ చూపించాడు. అనంతరం బంగారం తీసుకుని అక్కడి నుంచి క్షణాల్లో బయటకు వెళ్లిపోయాడు. ఖాతాను పరిశీలించిన దుకాణ యజమానికి డబ్బులు జమ కాలేదని తెలియడంతో, వెంటనే ఆ వ్యక్తిని పిలిచినా స్పందించకుండా పరారయ్యాడు. ఈ ఘటనలో దాదాపు రూ1 లక్ష విలువైన నగలు చోరీకి గురైనట్లు యజమాని తెలిపారు. ఘటన అనంతరం దుకాణంలోని సీసీటీవీ దృశ్యాలను సోషల్ మీడియాలో విడుదల చేసిన యజమాని, నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగల దుకాణం యజమాని స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేశారు.

# పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

## నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రధాన మంత్రి రాజీనామా చేయాలి

## పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ

ఖమ్మం విద్యా విభాగం జూలై 20, ప్రభాత వార్త: దేశ రాజధాని ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీతో పాటు విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తూ, పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరం లోని అర్. ఎన్. బి గస్ట్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీ కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని అన్నారు. దేశంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు కేంద్రం ప్రభుత్వాన్ని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల శ్రమ, భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకోవడం అత్యంత ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాల్సి ందిపోయి, పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రభుత్వం పైన ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్‌కు పాల్పడిన పోలీసు అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, సహాయ కార్యదర్శి యశ్వంత్, జిల్లా నాయకులు సురేష్, వెంకటేష్, శుశాంత్, సిద్దు గోపి, అనూష, అలేఖ్య సంధ్య, నవ్య పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ నాయకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# పేటలో ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

*అశ్వారావుపేట రూరల్, జూలై 20 ప్రభాతవార్త:*

అశ్వారావుపేట పట్టణాన్ని ఆదర్శనీయమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే జార ఆదినారాయణ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌తో పరిశీలించారు. ముందుగా క్రీడా మైదానాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడి మోలిక సదుపాయాలు,



క్రీడాకారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అభివృద్ధి చేయాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. యువతకు నాణ్యమైన క్రీడా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే యువ క్రీడాకారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాధన చేసే విధంగా మైదానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి పనిని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మిండా హరిబాబు, జీనుగు రవీంద్ర, స్థానిక నాయకులు, జూపల్లి ప్రమోద్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష పత్రాల లేకేజీ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే

*దమ్మపేట, జూలై 20, ప్రభాతవార్త:*

నీట్ పరీక్షా పత్రాలు లీకేజీ కి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో




పార్టీ మండల ముఖ్యులు సమావేశం మండల కమిటీసభ్యులు కొలికి పోగశ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ నీట్ పరీక్షా పత్రాలు లీకేజీ కి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ర్ ప్రధాన్ రాజీనామా చేయాలని, సోనం వాంగ్ చుక్ చేస్తున్న ఆమరణ నిరాహారదీక్షను భగ్నం చేసిన కేంద్ర ప్రభుత్వం వైఖరి నిఖండించారు. విధ్యార్ధుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారిని కఠినంగా శిక్షించాలని, విద్యా వ్యవస్థ లోని లోపాలను క్షుణ్ణంగా సరిచేసే విధంగా కేంద్ర ప్రభుత్వం విద్యావిధానం లో మార్పులు తీసుకు రావాలని డిమాండ్ చేశారు.

# నూతన తహశీల్దార్‌గా మద్దినేని మురళి బాధ్యతలు స్వీకరణ

*దమ్మపేట, జూలై 20 ప్రభాతవార్త:*

దమ్మపేట నూతన తాహశీర్‌గా మద్దినేని మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన కె. రామ్ నరేష్ పలు అవినీతి ఆరోపణలపై సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో అండర్ ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ గా వున్న మద్దినేని మురళిని దమ్మపేట తాహశీల్దార్ గా డిప్యుటేషన్‌పై నియమించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తాహశీల్దార్ మద్దినేని మురళికి స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

*అశ్వారావుపేట అర్బన్, జూలై 20 ప్రభాతవార్త:*

నీట్ పేపర్ లీక్, సిబి ఎస్ ఈ అవకతవకలు వంటి విద్య రంగా వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్




రాజీనామా చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్స్ తో కూడిన ప్ల కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ నీట్ పరీక్షను పారదర్శకంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏసు, రామస్వామి, తిరుపతిరావు, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 26న ఎస్సీసెల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

## కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

*అశ్వారావుపేట రూరల్, జూలై 20 ప్రభాతవార్త:*

ఈ నెల 26 న జిల్లా కేంద్రం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల, జిల్లా ఎస్సీ సెల్ నూతన కార్యవర్గ కమిటీల పదవీ స్వీకార మహోత్సవం సందర్భంగా రూపొందించిన కరప



త్రాలను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదవీ స్వీకార మహోత్సవానికి ముఖ్య చైర్మన్, మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ బూసి పాండురంగ, జిల్లా జనరల్ సెక్రటరీ భారతి, సెక్రటరీ జగదీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, దిశ కమిటీ సభ్యురాలు ఏసుమణి, తగరం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ లో శాకాంబరి అలంకరణ..

*తల్లాడ జులై 20: ప్రభాతవార్త*

ఆషాడ మాసం 6 వ రోజు అమ్మవారికి శాకంబరి అలంకరణ నిర్వహించారు కోట మైసమ్మ ఆలయంలో ఇలా ప్రోలు లాలయ్య సుజాత ఆధ్వర్యంలో అలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ లగడపాటి నెహ్రూ మాధవి తెలిపారు






# ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడుగా తిరుపతిరావు

*దమ్మపేట రూరల్ జూలై 20 ప్రభాతవార్త :*

దమ్మపేట ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దమ్మపేట మండలం మందలపల్లి గ్రామానికి చెందిన తనగల తిరుపతిరావు నియమితులయ్యారు. ఈ



సందర్భంగా అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణను అశ్వరావుపేట క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే జారె, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గద్దల రమేష్ కు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. కొత్తగూడెంలో ఈనెల 26వ తేదీన మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ చేతులు మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నట్టు తిరుపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు, దిశా కమిటీ సభ్యులు యేసుమణి, జనరల్ సెక్రెటరీ భారతి పాల్గొనున్నారు.

# ఉచిత శిక్షణ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జారె

*అశ్వారావుపేట అర్బన్, జూలై 20 ప్రభాతవార్త:*

మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ భద్రాచలం




వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం నిర్వహించనున్న ఉచిత ఉపాధి, ఉద్యోగ శిక్షణా కార్యక్రమాల ఏర్పాట్లను ఆకస్మికంగా పరిశీలించారు. యువతకు నాణ్యమైన శిక్షణ అందించి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం అశ్వారావుపేట క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ బలోపేతానికి, దళిత వర్గాల సంక్షేమానికి తీసుకోవాల్సిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుపులేటి రామస్వామి గారికి ప్రమాదం జరగడంతో వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి, యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్టు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు డిమాండ్ చేశారు**

**జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువతపై లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండించాలి...**

**సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం**

*వైరా టౌన్ జులై 20 (ప్రభాతవార్త)*

సిపిఎం వైరా డివిజన్ కమిటీ సమావేశం సోమవారం వైరా బోడేపూడి భవన్‌లో జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నున్నా నాగేశ్వరరావు, వైరా డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ భూక్యా వీరభద్రం మాట్లాడుతూ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రభుత్వ పరీక్షల్లో జరుగుతున్న అవినీతి, ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామకాల్లో అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాలు నిర్వహించిన నిరసనపై కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆదేశాలతో ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న నిరసనకారులను అడ్డుకుని బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులపై దాడేనని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పరీక్షల్లో జరుగుతున్న అవినీతి, ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువతపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని, విద్యా వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరావు, డివిజన్ నాయకులు మచ్చా మణి, దొంతబోయిన నాగేశ్వరావు, బాణాల శ్రీనివాసరావు, కే. నరేంద్ర, చెర్కుమల్లి కుటుంబరావు, తోట నాగేశ్వరరావు, కొండబోయిన ఉమావతి, తాత పద్మ, ఏర్పుల రాములు, వజ్జా రామారావు, బోయినపల్లి శ్రీనివాసరావు, తుము సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# బినామీ వీఆర్‌ఏ పై చర్యలు తీసుకోవాలి

**బాధిత రైతులు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆందోళన**

**డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేత**

*కారేపల్లి జూలై 20 ప్రభాతవార్త*

మండల తాసిల్దార్ కార్యాలయంలో బినామీ పేరుతో వీఆర్ఎగా కొనసాగుతున్న కల్లోజి శ్రీనివాసు ద్వారా మండల పరిధిలోనే చీమలపాడు బాజు మల్లయ్య గూడెం గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆరోపిస్తూ సోమవారం ప్రజావాణిలో డిప్యూటీ తాసిల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేసి, ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు అందజేసిన విజ్ఞాపన పత్రంలోసింగరేణి మండలం, చీమలపాడు, బాజు మల్లాయిగుడెం మా గ్రామంలో ఉన్న భూములకు సంబంధించిన 196970 సహాణీలు బినామీ వీఆర్ఏ కల్లోజి శ్రీనివాస్ వచ్చిన తర్వాత కనబడుట లేదని రైతుల ఆరోపిస్తున్నారు. సింగరేణి మండల తహసీల్దారు ఆఫీసులో చేరినప్పటి నుండి చీమలపాడు. బాజు మల్లాయిగూడెం గ్రామాలకు సంబంధించిన రైతు దస్త్రాలను తారుమారు చేస్తూ అధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నట్లు తెలిపారు ఇతని తాతల భూములను గతములో చీమలపాడు, బాజు మల్లాయిగుడెం గ్రామ రైతులకు అమ్ముకొని ప్రస్తుతము అట్టి భూములను కొన్న రైతులకు సింగరేణి మండల ఆఫీసు నుండి నోటీసులు పంపుతూ, బెదరింపులకు పాల్పడుతున్నారన్నారు.. అంతేకాక ప్రస్తుతము సీతారామ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులపై గతములో భూములు అమ్ముకున్న వారిని రెచ్చగొట్టి గొడవలకు పాల్పడుతున్నాడు. వీఆర్ఏ అసలు ఉద్యోగం కల్లోజి వెంకటి సన్నాఫ్ పెద్దులు పేరుతో ఉండగా కల్లోజి శ్రీనివాస్ ఎందుకు విధులకు హాజరవుతున్నాడు అని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివాదాలకు కారణమైన కల్లోజి శ్రీనివాస్ పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని చీమలపాడు. బాజు మల్లాయిగూడెం రైతులు అధికారులను కోరుతున్నారు .కార్యక్రమంలో రైతులు మాలోత్ కిషోర్, గుజ్జర్లపూడి సైదులు, పాటీ రమేష్, పాటి రంగయ్య, మాలోత్ స్వామి, పోతుల సత్యమయ్య పోతుల వెంకటేశ్వర్లు, బానోత్ భాషా, కొండం వెంకటేశ్వర్లు, పాటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.



# మణుగూరులో 26వ తేదీన విస్తృతస్థాయి సమావేశం

**ఆది వాసుల ప్రధాన సమస్యలపై సమీతుడుం దెబ్బ నేతలు**

*కారేపల్లి జులై 20 ప్రభాతవార్త*

ఆదివాసుల ప్రధాన సమస్యలపైఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీలు విస్తృతస్థాయి సమావేశం ఈనెల 26వ తేదీన మణుగూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా తుడుం దెబ్బ ఉపాధ్యక్షులు పు ల సంబ్రద్రం డివిజన్ అధ్యక్షులు ఉండం శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని అ ప్పాయి గూడెం గ్రామంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మణుగూరు సమావేశంలో ప్రధానంగా ఎస్టీ జాబితా నుండి లంబాడీల తొలగింపు ఉద్యమ కార్యాచరణ వన్ బై 70 చట్టం పరిరక్షణక అంశాలు పై సమీక్ష ఉంటుందన్నారు.1672 మంది గిరిజనేతరులు1/70 సవరణలు కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించటంపై జిల్లా కమిటీ తీసుకోవలసిన కార్యాచరణ , చర్చిస్తారన్నారు. జీవో నెంబర్ 3, అమలు,ఆదివాసి పోడు భూముల రైతుల హక్కు పత్రాలు తో పాటు ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా జరుపుటకు తదితర ప్రధాన సమస్యలపై, పరిష్కారం కోసం కార్యచరణ రూపొందించుటకై ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు.గ్రామ, మండల,జిల్లా, రాష్ట్ర, జాతీయ కమిటీల బాధ్యులు తుడుం దెబ్బ సీనియర్ నాయకులు సంఘ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.





# చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

*కారేపల్లి జూలై 20 ప్రభాతవార్త*

కొత్త లింగాల ధనలక్ష్మి ౹ ఫంక్షన్ హాల్ నందు సోమవారం సింగరేణి మండలం గెట్ కారేపల్లి గ్రామానికి చెందిన చెరుకూరి కోటేశ్వరరావు ఉమారాణి ల కుమార్తె, కుమారుడు ల ఓనిలా అలంకరణ వేడుకకు వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ హాజరై చిన్నారులు సంధ్యారాణి, పార్థు లను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలోమాజీ వైస్ ఎంపిపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్, మాజీ సొసైటీ చైర్మన్ తోటకూరి శ్రీను, మాజీ ఎంపిటీసీ ల సంఘం అధ్యక్షులు దారావత్ పాండ్య నాయక్, మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, మాజీ మార్కెట్ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, నాయకులు మందేపూడి సత్యనారాయణ, చెరుకూరి రమేష్, చెరుకూరి నర్సయ్య, భూక్యా రాంకిషోర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యాశాఖ నిబంధన ప్రకారం నడుచుకోవాలి

**నిబంధనలు అధిగమిస్తే కఠిన చర్యలు తప్పవు వైరా ఎంఈఓ**

*వైరా టౌన్ జులై 20 (ప్రభాత వార్త)*

వైరా మున్సిపాలిటీ పరిధిలోని నిర్వహించబడే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు విద్యాశాఖ సంబంధిత శాఖల అనుమతులు లేకుండా పాఠశాల షిఫ్టింగ్, కొత్త ప్రాంగణంలో నిర్వహణ, లేదా ప్రచార బోర్డులు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధం. అన్ని అనుమతులు పూర్తిగా పొందిన తరువాతే ఏదైనా కొత్త ప్రాంగణంలో పాఠశాల నిర్వహణ లేదా బోర్డుల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలి. వైరా మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు, విద్యాశాఖ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి. గుర్తింపు లేకుండా ఎటువంటి విద్యా కార్యకలాపాలు నిర్వహించకూడదు. గుర్తింపు పొందిన పాఠశాలలు కూడా భవన మార్పిడి లేదా కొత్త ప్రాంగణానికి తరలింపు చేపట్టే సందర్భంలో సంబంధిత అధికారుల అనుమతులు పొందిన తరువాతే తదుపరి చర్యలు తీసుకోవాలి. అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు. ఈ విషయాన్ని గమనించి నిబంధనలను కచ్చితంగా పాటించాలని మండల విద్యాశాఖాధికారి చావా శ్రీనివాసరావు మండలంలోని అన్ని ప్రైవేటు విద్యాసంస్థలకు తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ సూచించారు.



# మద్దులపల్లి పాతూరు డొంక రోడ్డు మంజూరు చేయాలి

**ఎల్ టి లైన్ ఏర్పాటు చేయాలి**

**పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి**

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు విన్నవించిన**

**మద్దులపల్లి సర్పంచ్ పడిగ నాగమణి**

*కామేపల్లి, జూలై 20 ప్రభాతవార్త*

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కామేపల్లి మండ లం మద్దులపల్లి లో పర్యటించిన సందర్భంగా స్థానిక సర్పంచ్ పడిగ నాగమణి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.పాతూరు డొంక రోడ్డు సత్వరమే మంజూరు చేసి ని ర్మించాలని కోరారు.రోడ్డు సౌకర్యం లేక రైతులు పొలాలకు వెళ్లడానికి పడరాన్ని పాట్లు పడుతున్నారని పేర్కొన్నారు.మందు కట్టలు ఎత్తుకొని పొలాలకు రెండు కిలో మీటర్ల దూరం నడవడానికి వారు పడు తున్న బాధలు వర్ణనాతీతమన్నారు.అదే విధంగా గ్రామంలో కొత్తగా ఇల్లులు నిర్మించుకున్న కాలనీ వారు విద్యుత్ ఎల్ టీ లైన్ లేక నానా అవస్థలు పడుతున్నారన్నా రు.పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని సర్పంచ్ నాగమణి విన్నవించారు.ఈ కార్యక్ర మంలో రైతులు, గ్రామస్తులు,పంచాయతీ పాలక వర్గ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

**24 గ్రాములు బంగారం, కేజీన్నర వెండి స్వాధీనం**

**పెనుబల్లి, జులై 20, ప్రభాతవార్త**



గత కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగలను ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి వెండి, బంగారం వస్తువులను స్వాధీనపరచుకొని దొంగతనానికి వినియోగించిన కారుని, మోటార్ సైకిల్ ని స్వాధీనపరుచుకున్నట్లు కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. సోమవారం వి ఎం బంజర పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ మూర్తి లింగయ్య, వి ఎం బంజర ఎస్ ఐ వెంకటేష్, కల్లూరు ఎస్సై హరిత లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్కే జానీ తల్లాడ మండలం, పేరాల నరసింహారావు ఎటపాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఆర్య ఉదయకుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వాసిగా గుర్తించారు. ఆదివారం నిందితులు కారు, మోటార్



సైకిల్ పై ప్రయాణించి ఆంధ్రప్రదేశ్ లోని తిరువూరులో చోరీ చేయబడిన బంగారు నగలను, వెండి వస్తువులను విక్రయించేందుకు ముత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే దిగి తిరువూరు వైపు వెళ్తుండగా వాహనాలు తనిఖీల్లో భాగంగా అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న కారుని అందులో ప్రయాణిస్తున్న ముగ్గురిని ప్రశ్నించడంతో దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు పంచనామాలో తెలియపరిచారు. నిందితులపైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయి ఉన్నాయని, పలు డెకరేట్ కేసులు సైతం నమోదైనట్టు ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. దొంగలను పట్టుకున్న వియం బంజర్ కల్లూరు పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఆమె అభినందించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించనున్నట్లు ఆమె వివరించారు. అదేవిధంగా దేవాలయాల ప్రాంతంలో నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దేవాలయాల ప్రాంగణంలో దీపాలు వెలిగించాలని, దేవాలయ ప్రాంగణాలు ఎప్పుడు వెలుతురులో ఉండాలని ఆమె సూచించారు. ఇప్పటికే దొంగలు పలుచోట్ల దేవాలయాలతో పాటు విద్యుత్తు ట్రాన్సారంలను కూడా దొంగలిస్తున్నారని ఆయకట్టు రైతులు సైతం దృష్టి సారించాలని ఆమె సూచించారు.

## స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లి దండ్రులకు సన్మానం

**కల్లూరు, జులై 20, ప్రభాతవార్త**

కల్లూరు విజ్ఞాన్ స్కూల్ నందు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లి దండ్రులకు సన్మానం నిర్వహించారు . ఈ సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ ఉయ్యూరి శ్రీవ్యాల్ మాట్లాడుతూ ప్రతీ తల్లిదండ్రులు ప్రస్తుతం వారి యొక్క పిల్లలను పెద్ద పెద్ద చదువులు చదివించడానికి కష్టాన్ని కూడా లెక్కచేయకుండా ఆస్తులు కంటే పిల్లలు, చదువులే ముఖ్యం అని భావించి వారి జీవితాన్ని కవ్వొత్తి లాగా కరిగిపోతు త్యాగం చేస్తున్నారు కనుక ఎన్ని జన్మలెత్తిన వారి ఋణం తీర్చలేము, కనుక వారి కష్టాన్ని వమ్ము చేయకుండా దీపం వెలుగు కారుచీకట్లను తొలగించే వెలుగుగా మారాలని, మంచి ఉద్యోగాల్లో సెటిల్ అయ్యి మీ తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని విద్యార్థులకు తెలుపుతూ ఇదే మా స్ఫూర్తి ఫౌండేషన్ కు ఇచ్చే పెద్ద రిటర్న్ గిఫ్ట్ అని తెలిపారు. అంతేకాకుండా రానున్న కాలంలో మన రాష్ట్రాల్లో ఏంజివో స్ ల్పి వారి యొక్క అవసరం లేకుండా సొంతంగా చదివించుకునే పరిస్థితులు, అభివృద్ధి ఉండాలని వారి అవసరం ఉండకుండా ఉండాలని కోరుకుంటూ సభకు హాజరైన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిథులు మున్సిపాలిటీ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్,



ఎంఎసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, స్థానిక అంబేద్కర్ నగర్ జిల్లా అధికారులు జినుగు మరియన్న, జిల్లా హార్టికల్చర్ అధికారి మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా డి పి ఆర్ ఓ శీలం శ్రీనివాసరావు, విజ్ఞాన్ స్కూల్ కరెస్పాండెంట్ షేక్ ఇస్మాయిల్, కల్లూరు మున్సిపాలిటీ 16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, రిటైర్డ్ లెక్చరర్ ఉబ్బన నాగరాజు, స్ఫూర్తి ఫౌండేషన్ ,లబ్ధిదారులు తల్లిదండ్రులు, విద్యార్థులు స్ఫూర్తి కమిటీ సభ్యులు ఉబ్బన బాబూరావు, జల్లి రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, చింతలపూడి కృష్ణ, ఉబ్బన వేణుబాబు, షేక్ ముజీమ్, మర్రెల వెంకటేశ్వరావు, ఇందూరి దేవేందర్, దామల దయాకర్ పాల్గొన్నారు.

## ప్రత్యేక తెలంగాణా ఉద్యమ కారుల గుర్తింపు

**కల్లూరు, జులై 20, ప్రభాతవార్త**

తెలంగాణా ఉద్యమ కారుల గుర్తింపు కమిటీ చైర్మన్ సభ్యులకు తెలంగాణా ఉద్యమ కారుల సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తల్లపురెడ్డి నర్సిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి తరం తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారుల గుర్తింపు కమిటీ దశల వారీగా ప్రత్యేక తెలంగాణా సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల ను గుర్తించి వారి కుటుంబాలకు అండగా నిలబడి ప్రభుత్వం ద్వారా ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, ఎన్నో ఏండ్ల గా ఖమ్మం జిల్లా తొలి తరం ప్రత్యేక తెలంగాణా సాధన సమితి ఆధ్వర్యంలో 2014 నుండి అనేక రూపాల్లో ప్రభుత్వ పెద్దలకు వివిధ మార్గాలద్వారా విన్నవించటం జరిగినది అయినా కూడా మా మొర ఆలకించిన పాపాన పోలేదు అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం తొలి తరం ఉద్యమకారుల గుర్తింపు కోసం కమిటీ ఏర్పాటు చేయటం,కమిటీ చైర్మన్ కే కేశవరావు,సభ్యులు పొన్నం ప్రభాకర్, మంత్రి, సభ్యులు ప్రొఫెసర్ కోదండ రామ్, ఎమ్మెల్సీ, అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ, రాములు నాయక్ , శోభన్ రెడ్డి ఉద్యమ కారులను గుర్తించటం కోసం వివిధ రంగాలకు చెందిన వారిని కమిటీ ముందుకు పిలిపించి ఉద్యమ సమయంలో వీరు చేసిన త్యాగాల గురించి చర్చించటం కోసం దశల వారీగా చర్చలు జరుపుతున్నారన్నారు.అందులో భాగంగా సోమవారం ఖమ్మం జిల్లా తొలి తరం ఉద్యమకారుల సంక్షేమ సంఘం కమిటీ నీ వివరాలు సేకరించుటకు హైదరాబాద్ కమిటీ వారు పిలవగా ఖమ్మం జిల్లా కమిటీ తరుపున అధ్యక్షులు తల్లపురెడ్డి నర్సిరెడ్డి , కమిటీ సభ్యులు హాజరు అయి తొలితరం తెలంగాణా రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సంక్షేమ పట్ల ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని వారి కుటుంబాలకు,పిల్లలకు న్యాయం చేయాలని వివరాలు అందచేయటం జరిగినది, అధ్యక్షులు తల్లపురెడ్డి నర్సిరెడ్డి మరియు కమిటీ సభ్యులు చెప్పిన విషయాలు సావధానంగా విన్న ప్రభుత్వం నియమించిన గుర్తింపు కమిటీ చైర్మన్, సభ్యులు నిజమైన ఉద్యమ కారుల ను గుర్తించి న్యాయం చేస్తామని గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలపటం జరిగినది. ఈ సందర్భంగా మా ఉద్యమ కారుల సంక్షేమ పట్ల సానుకూలంగా




## చైర్మన్ సారూ... ఈ రోడ్డుకి కొంచెం కాంక్రీట్ వేయరూ

**. కల్లూరు, జులై 20, ప్రభాతవార్త**



కల్లూరు మున్సిపాలిటీలో కరెంట్ ఆఫీస్ కు వెళ్లే రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి.. కరెంట్ ఆఫీస్ తో పాటు అంబేద్కర్ నగర్ కు వెళ్లే వాహనాలు కూడా ఇటువైపు ప్రయాణిస్తాయి. అంతే కాకుండా సాగర కాలువ కూడా పక్కనే ఉండడంతో రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో ఈ రహదారి అనేక ప్రమాదాలకు కారణమై కొంతమంది మరణించిన సందర్భాలు ఉన్నాయి. కరెంట్ ఆఫీస్ కి నిత్యం వందలాది మంది వస్తుంటారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో..పాలక వర్గం ప్రథమ ప్రాధాన్యతగా 17వార్డ్ లో భాగమైన ఈ రహదారిని కాంక్రీట్ గా మార్చి వందలాది మంది ప్రయాణంలో సహకరించి మున్సిపాలిటీకి వన్నె తేవాలని కల్లూరు మున్సిపాలిటీ ప్రజలు, మండల వాసులు కోరుకుంటున్నారు.

## అతిథి అధ్యాపకులు దరఖాస్తులకు ఆహ్వానం...

**సత్తుపల్లి జూలై 20 ప్రభాతవార్త**

సత్తుపల్లిజేవియర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలుచేపట్టేందుకు గాను అతిథి అధ్యాపకుల నుండి దరఖాస్తులను ఆహ్వానించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ గోపి సోమవారంఒక ప్రకటనద్వారాతెలియజేశారు.తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషనర్ వారి ఉత్తర్వుల మేరకు 202627 విద్యా సంవత్సరానికి గాను కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ (02)బి ఎఫ్ ఎస్ ఐ(కామర్స్) (01)డైరీ సైన్స్ (01)పొలిటికల్ సైన్స్ (01)ఫిజిక్స్ (01)పోస్టులకు సంబంధించిన అతిథి అధ్యాపకుల నియామకాలు డెమో ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా చేపట్టనున్నట్లు తెలియజేశారు.అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు పీజీలో 55శాతం మార్కులు ఎస్సీ ఎస్టీ దివ్యాంగులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని అన్నా ు.కళాశాలకమిషనర్నిబంధనలమేరకు నియామక ప్రక్రియ ఉంటుంది.ఆసక్తి గల అభ్యర్థులు 24.07.2026 సాయంత్రం నాలుగు గంటల లోపు పూర్తి బయోడేటా తో పాటు జిరాక్స్ సర్టిఫికెట్స్ జతచేసి అప్లికేషన్ జేవియర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సత్తుపల్లి నందు సమర్పించాలని ప్రిన్సిపాల్ గోపి కోరుతున్నారు.

## వెంగళరావు నగర్ లో సి సి రోడ్డు శంకుస్థాపన చేసిన డాక్టర్ మట్ట...

**. సత్తుపల్లి జూలై 20 ప్రభాతవార్త**

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నగరాభివృద్ధి, టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు, నిర్మాణాలకు, శంకుస్థాపన, సైడ్ డ్రైనేజీ నిర్మాణాలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్ పాషా లు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో బీజీ కళాశాల హాస్టల్ విద్యార్థులకు ప్రధాన రహదారి నుండి హాస్టల్ వరకు నగరాభివృద్ధి నిధులైన రెండు లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ విజయకుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ మహమ్మద్ రెహానా కమల్ పాష లు సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే వెంగళరావునగర్లో, జలగం నగర్ లో టి యుఎఫ్ ఐ డి సి పది లక్షల రూపాయలతో నిర్మాణాలు జరుగుతున్న డ్రైనేజీలను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలకు రాజీ పడకుండా నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, చైర్ పర్సన్ మహమ్మద్ రెహానా కమల్ పాషాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ వైస్ చైర్పర్సన్, బొంతు సుమలత వేణు, మున్సిపల్ కమిషనర్ కే నరసింహం, మున్సిపల్ ఏఈ సురేష్, వార్డు కౌన్సిలర్ మట్ట దేవజ్యోతి, పట్టణ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ కమల్ పాష, దొడ్డ గోపాలరావు, పలువురు పాల్గొన్నారు



## ఒకే కుటుంబంలో రెండు ఉద్యోగాలు రెండు ఇందిరమ్మ ఇండ్లు ఇదెక్కడి న్యాయం అంటున్న బచ్చోడు గ్రామ ప్రజలు.

**అర్హులైన నిరుపేదలకు ఉద్యోగాలు ఇవ్వాలి -**

**అన్యాయ నియామకాలపై సమగ్ర విచారణ జరపాలి**

**రాజకీయ ఒత్తిళ్లతో కాదు, ప్రతిభతోనే ఉద్యోగాలు ఇవ్వాలి**

**ప్రజల స్వేచ్ఛను హరించే రాజకీయ బెదిరింపులను ఖండిస్తున్నాం**

**బిఆర్ఎస్‌న్యూడెమోక్రసి పార్టీల నిరసన**

*తిరుమలాయపాలెం ప్రభాత వార్త జూలై 20*

తిరుమలాయపాలెం మండలం లోని బచ్చోడు గ్రామంలో ప్రీ ప్రైమరీ నియామకల్లో అప్రూహాలైన నందిపాటి సృజన, రామనబోయిన రజితలకి ఉద్యోగాలు కల్పించాలి అర్హత కలిగిన నిరుపేద కుటుంబం నందిపాటి సృజన, రామనబోయిన రజితలకు ఉద్యోగం కల్పించకుండా, నిబంధనలకు విరుద్ధంగా అనర్హులత కలిగినవారికి ఉద్యోగాలు ఇవ్వడం పట్ల సిపిఐ



(ఎంఎల్) న్యూడెమోక్రసీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు జక్కుల యాదగిరి మండిపడ్డారు. సోమవారం బచ్చోడు గ్రామంలో నిరసన కార్యక్రమం చేయటం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బచ్చోడు గ్రామంలో ప్రీ ప్రైమరీ ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, సమానత్వం, సామాజిక న్యాయం పాటించకుండా నియంతృత్వ ధోరణి తో నిజంగా అర్హత కలిగిన అభ్యర్థులను పక్కనపెట్టి, అనర్హత కలిగిన వారికి ఉద్యోగాలు ఇచ్చి అక్రమాలకు పాల్పడితే అది యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందనీ . అందువల్ల సంబంధిత అధికారులు నియామక ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టి, ఎంపికలో జరిగిన అక్రమాలపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అర్హత ఉన్న ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో అన్ని నియామకాలు పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వ అధికారులను వారు డిమాండ్ చేశారు. అర్హుల హక్కుల కోసం సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, బిఆర్ఎస్ పార్టీలు నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గుజ్జా రామకృష్ణ నిరసన సభకు అధ్యక్షత వహించారు. అర్హత కలిగిన అభ్యర్థి నందిపాటి సృజన భావోద్వేగానికి గురై మాట్లాడినారు. సందు రాజు, వేములపల్లి మల్లికార్జున్, నందిపాటి లక్ష్మీ మ్నారాయణ, గొర్రెపాటి లింగయ్య, దారమల్ల కృష్ణ, భగత్ సింగ్, లెనిన్, నందిపాటి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు

## కూసుమంచి గ్రామ పంచాయితీలో పంచాయితీ లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం..?

### నేడు విచారణకు ఆదేశించిన ఎంపీఓ

*కూసుమంచి, జూలై 20 (ప్రభాతవార్త ) :*

కూసుమంచి గ్రామ పంచాయితీలో జరిగిన లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం ఫిర్యాదు పై ఎంపీఓ ఆర్. హనుమంతరావు విచారణకు ఆదేశించారు. దీనిలో భాగంగా పంచాయితీ పాలకవర్గం సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి, వార్డు సభ్యులకు ఆదివారం నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులో మంగళవారం ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని, విచారణలో భాగంగా కార్యాలయం రికార్డులు అన్ని సిద్ధంగా ఉంచాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గ కేంద్రం కూసుమంచిలో లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం పై ఎంపీఓ విచారణకు ఆదేశించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. విచారణలో ఎన్ని లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరిగింది..? ఎవరు కాజేశారు..? అనేది విచారణలో బట్టబయలు కానుంది. ఈ నేపథ్యంలో కూసుమంచి గ్రామస్తులు విచారణ అధికారులు ఏం తేల్చుతారోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.



## పిండిప్రోలు గ్రామం లో పోలీసుల ఆధ్వర్యం లో కార్డన్ సెర్చ్ నిర్వహణ

*తిరుమలాయపాలెం జులై 20 ప్రభాత వార్త*

ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ , ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు, సీఐ సంజయ్ ఆధ్వర్యం లో తిరుమలాయపాలెం మండలం లోని పిండిప్రోలు గ్రామం లో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇటీవల గ్రామం లో చోటుచేసుకున్న వృద్ధురాలి హత్య ఘటన నేపథ్యంలో భద్రతా చర్యలను



మరింత కట్టుదిట్టం చేస్తూ ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలోని అనుమానాస్పద ప్రాంతాలు, వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టి పలు ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఎస్సై కూచిపూడి జగదీష్ పిండిప్రోలు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామంలోని బెల్ట్ షాప్ నిర్వాహకులతో సమావేశమై అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అసంఘీఖ వాదులు జరుపుతున్న ఘటనల పై వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్సైలు కూచిపూడి జగదీష్ నాగరాజు కాసర్ల రాజయ్య సంతోష్ దివ్య గ్రామ సర్పంచ్ కామల్ల సువార్త ఉప సర్పంచ్ చామకూరి రాజ్ కుమార్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఎన్యుమరేషన్ ఫారాలను బి ఎల్ వో లకు అందజేయాలి

**తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి**

*కామేపల్లి, జూలై 20 ప్రభాతవార్త:*

ఓటర్లు తమ వివరాలను ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేసి వెంటనే



బి ఎల్ వో లకు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి కోరారు. కామేపల్లి మండలం పాత లింగాల గ్రామంలో సోమవారం ఆయన తన వివరాలను ఫారం లో నమోదు చేసి బిఎల్ వో అహల్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రామ్ రెడ్డి జగన్నాథ రెడ్డి, చామంతుల విశ్వనాథం, దొప్ప రమేష్, కృష్ణంరాజు, వరి కొల్లు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చర్ల లో నూతన పైప్ లైన్ నిర్మాణం సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ

*కామేపల్లి, జూలై 20 ప్రభాతవార్త:*

కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంలో నూతన పైప్ లైన్ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించినట్లు సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ తెలిపారు. హాస్టల్ నుండి పాయల్ బజార్, మర్రిచెట్టు, వెలగ లేటి కృష్ణ, బాపయ్య ఇంటి వరకు తాగు నీటిని సరఫరా చేసేందుకు పైప్ లైన్ నిర్మాణ పనులను చేపట్టినట్టు తెలిపారు. గతంలో ఉన్న పైపు లైన్ లో తరచూ మరమ్మతు పనులు వస్తుండడంతో నూతన పైప్ లైన్ పనులను చేపట్టినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి. అనురాధ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## శభాష్ ఆనంద్ సార్

*నేలకొండపల్లి, జూలై 20 ప్రభాతవార్త:*

పాఠాలతో పాటు విద్యార్థులు ఆరోగ్య రక్షణ కోసం కూడా పాటుపడతారని నిరూపించాడు. ఓ ఉపాధ్యాయుడు. నేలకొండపల్లి మండలంలోని మంగాపురంతండా ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న యోగిత అనే విద్యార్థినికి సోమవారం ఆడుకుంటుండగా గాయమైంది. విద్యార్థి కాలికి గాయం వద్ద కారుతున్న రక్తాన్ని చూసి చలించిన స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నందిగామ ఆనంద్ విద్యార్థినికి ప్రథమ చికత్స చేశారు. కాలుకు తగిలిన దెబ్బ ను శుభ్రపరిచాడు. కట్టు కట్టి దగ్గరుండి ఇంటికి పంపించారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధించటమే కాదు విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కూడా తమదే బాధ్యత తమదేనని ఉపాధ్యాయుడు ఆనంద్ నిరూపించడంతో గ్రామస్తులు అభినందించారు. మంగాపురంతండా సర్పంచ్ ధీరావత్ అశోకరాణి, గ్రామ పెద్దలు శభాష్ సారు అంటూ ప్రశంసించారు.



## అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి పూజలు

*నేలకొండపల్లి, జూలై 20 ప్రభాతవార్త :*

బోదులబండ గ్రామంలో ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద16 రోజుల



పండుగను పురస్కరించుకుని సోమవారంవేదమంత్రాల నడుమ అత్యంత వైభవంగాఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్టెకోల నాగార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామం లోని మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అలాగే, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి.

**పోలీసులను వేడుకున్న బాధితురాలు ధీరావత్ పుష్పావతి**

*నేలకొండపల్లి, జూలై 20 ప్రభాతవార్త:*

ఆక్రమణకు గురైన తమ పొలాన్ని తిరిగి తనకు అప్పగించాలని కోరుతూ మంగాపురంతండా శివారు గ్రామమైన రేగులగడ్డ తండకు చెందిన ధీరావత్ పుష్పావతి సోమవారం నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తమ పొలం పక్కన ఉన్నటువంటి రైతు దాదాపుగా రెండు కుంటల భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నారని సంగతి తెలిసిందే. గత దశాబ్ద కాలంగా జరుగుతున్న గొడవ కు ఇరువురి అంగీకారంతో డిజిటల్ సర్వే చేయగా పక్క రైతు పొలంలో దాదాపు రెండు కుంటల వరకు భూమి ఎక్కువ ఉన్నది. అదేవిధంగా మా పొలములో అనగా ధీరావతు పుష్పావతి అయిన నేను బాధితురాలుగా పూర్తి ఆధారాలతో జులై 8వ తారీఖున నేను నేలకొండపల్లి ఎస్సై కు ఫిర్యాదు చేయడం జరిగినది. అయినా నేటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు ఆమె తెలిపారు.



# మున్నేరు చెక్ డ్యాం కూల్చివేతతో నీటి కష్టాలు

**శాశ్వతంగా నీటి కష్టాలు తీర్చేందుకే చెక్ డ్యాం నిర్మాణం**

**మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్ ఆవేదన**

ప్రభాతవార్త గాంధీ చౌక్ జులై 20





ఖమ్మం నగరంలో ప్రస్తుతం నెలకొన్న తీవ్రమైన తాగునీటి కొరత కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ, అనాలోచిత, ముందు చూపులేని పాలనకు ప్రత్యేక నిదర్శనమని మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ ఆరోపించారు. ఖమ్మం నగర ప్రజలకు శాశ్వత నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకాష్ నగర్ వద్ద మున్నేరు వాగు పై సుమారు 8 కోట్ల రూపాయల వ్యయంతో చెక్ డాం నిర్మించారని ఆ చెక్ డాం నిర్మాణం వల్ల మున్నేరు పరివాహక ప్రాంతంలో భూగర్భ జలమట్టం గణనీయంగా పెరగడంతో పాటు, నగరవ్యాప్తంగా నీటి లభ్యత మెరుగుపడి ప్రజలకు తాగునీటి సమస్య చాలావరకు పరిష్కారం అయిందని బచ్చు విజయకుమార్ తెలియజేశారు. ప్రజల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళిక లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పువ్వాడ పై రాజకీయ కక్ష సాధింపుతో ప్రకాష్ నగర్ వద్ద ఉన్న మున్నేరు చెక్ డ్యామును పూర్తిస్థాయిలో కూల్చివేసిందని దాని ఫలితంగా ప్రస్తుతం ఖమ్మం నగర ప్రజలు నీటి నిల్వలు కోల్పోతున్నారని తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితికీ కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు గతంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో వరద ముంపు నివారణ కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన మున్నేరు వాగుకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణం పనులు కొనసాగుతుండగా, మరోవైపు అదే ప్రాంతంలోని చెక్ డ్యామ్ లో ఉంచి వేయడం ద్వారా ప్రభుత్వం అసలు ఏ ప్రయోజనం సాధించిం దని ప్రశ్నించారు. వరద నివారణ చర్యలు కొనసాగుతూనే నీటి నిల్వలకు ఉపయోగపడే నిర్మాణాన్ని తొలగించడం పూర్తిగా ప్రణాళిక రాయిత్యానికి నిదర్శనం అని అన్నారు. ప్రజలకు మేలు చేసే చెక్ డ్యామ్ ను తొలగించి నగరంపై నీటి కరువును కాంగ్రెస్ ప్రభుత్వం స్వయంగా ఆహ్వానించిందని విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను సంరక్షించి మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం మాజీ మంత్రి పువ్వాడ హయాంలో నిర్మించిన ప్రజో పయోగ నిర్మాణాలను నాశనం చేయడానికి పరిమితమైందని, అభివృద్ధి చేయడం చేతకాక, గత ప్రభుత్వ పనులను కూల్చివేయటమే ఈ ప్రభుత్వం పాలనగా మారిందని విమర్శించారు.

ఎల్ నినో దృష్ట్యా తాగునీటి నిల్వలను పెంచడం, ప్రత్యామ్నాయ నీటి వనరుల సిద్ధం చేయ డం, చెరువులు, వాగులు, చెక్ డాములను సంరక్షించడం తద్వారా భూగర్భ జలాలను పరిరక్షించడం వంటి ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫల మైందని దాని ఫలితంగా ఖమ్మం నగరం తీవ్ర తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు ధోరణిని విడనాడి ఖమ్మం నగర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే సమగ్ర తాగునీటి కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని మున్నేరు వాగులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించే చర్యలు యుద్ధ ప్రాతి పదికన చేపట్టాలని ప్రభుత్వాన్ని మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్ డిమాండ్ చేశారు.



## గిరిజన దర్బార్ వినతులపై వెంటనే చర్యలు

**ప్రతి అర్జీకి గడువులో పరిష్కారం చూపాలి**

**యూనిట్ అధికారులకు ఐటీడీఏ పీవో బి. రాహుల్ ఆదేశం**

భద్రాచలం, ప్రభాతవార్త,జూలై 20

గిరిజన దర్బార్‌లో స్వీకరించిన ప్రతి వినతిని నిర్దేశిత గడువులో పరిష్కరించాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ అధికారులను ఆదేశించారు. సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల సమస్యలను ఆయన స్వయంగా స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు. భూ వివాదాలు, పోడు భూముల పట్టాలు, వ్యవసాయ విద్యుత్, బోర్లు, స్వయం ఉపాధి రుణాలు, మత్స్య సహకార సంఘాల సమస్యలు, సోలార్ విద్యుత్, దీర్ఘకాలిక వ్యాధుల వైద్యం, గురుకులాలు–ఈఎంఆర్ఎస్ ప్రవేశాలు, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి ్ర, ఇతర సంక్షేమ పథకాలపై పెద్దఎత్తున అర్జీలు అందాయి. ప్రతి దరఖాస్తును నమోదు చేయడమే కాకుండా ఫలితాలు కనిపించేలా కార్యాచరణ రూపొందించాలని, తక్షణం పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని పీవో సూచించారు. పెండింగ్‌లో ఉన్న వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించి గిరిజనులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిరక్ష్యం, జాప్యానికి తావులేకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పూర్తి ఆధారాలతో దరఖాస్తులు సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్డీసీ ఆనంద్‌కుమార్, గురుకులం ఆర్సీఓ అరుణకుమారి, ఈఈ మధుకర్, డీడీ చందన, ఏడీఎంహెచ్‌వో సైదులు, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

## గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్‌కు మాదారం రైతుల వినతి

కొత్తగూడెం టౌన్, జూలై 20 ప్రభాతవార్త:




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మొలకలపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన 20 మంది సన్న, చిన్నకారు రైతులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సీతారామ ప్రాజెక్టు పిల్లకాలువ తవ్వకాల కారణంగా తమ వ్యవసాయ భూములు నష్టపోతున్నాయని, అయితే ఈ పిల్లకాలువ వల్ల తమ గ్రామ రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, సాగునీరు కూడా అందదని వారు తెలిపారు. భూమి తప్ప తమకు ఇతర జీవనాధారం లేదా ఆదాయ మార్గాలు లేవని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ భూమి చూపించకుండా కేవలం రూ.13 లక్షల పరిహారం మాత్రమే ఇస్తామని అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో గ్రామసభ నిర్వహించి, భూముల ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా న్యాయమైన పరిహారం నిర్ణయించి చెల్లించాలని కోరారు. తమ సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాదారం గ్రామ రైతులు నాగబాబు, ముదిగొండ కృష్ణ, ఊకంటి కిషోర్, నారం ముత్యాలు, ఊకంటి మురళి, కనుగొట్ల కృష్ణారెడ్డి, ప్రభాకర్ రావు, చిట్టిబాబు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

**ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్యకు మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాదావత్ రవి విజ్ఞప్తి**

**పక్షవాతం, స్ట్రోక్ బాధితులకు స్థానికంగానే చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలి**

ఇల్లందు, జూలై 20, ప్రభాతవార్త





సమాజ సేవనే ధ్యేయంగా, పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాదావత్ రవి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని ప్రజా ఆరోగ్య సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలంటే ఇల్లందులో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ, ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలు, గిరిజన తండాలు ఇప్పటికీ సరైన వైద్య సదుపాయాలకు దూరంగా ఉన్నాయని తెలిపారు. పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్, ప్రమాదాల కారణంగా అవయవాల పనితీరు కోల్పోయిన వారు, వికలాంగులు, వృద్ధులు సరైన ఫిజియోథెరపీ చికిత్స అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి బాధితులకు సమీపంలోనే ప్రత్యేక ఫిజియోథెరపీ కేంద్రం ఉంటే వారి జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని వివరించారు. మిషన్ వాక్ ఫౌండేషన్ ప్రారంభించినప్పటి నుం చి వేలాది మంది పక్షవాత బాధితులు, వికలాం గులు, బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ అనంతరం నడవలేని స్థితికి చేరుకున్న వారికి పునరావాస సేవలు అందిస్తూ సాధారణ జీవితానికి చేరువ చేస్తున్నామని తెలిపారు. గ్రామాలకే వెళ్లి బాధితులను గుర్తిస్తున్న మిషన్ వాక్ ఫౌండేషన్ డాక్టర్ రవి నేతృత్వంలోని మిషన్ వాక్ బృందం ప్రస్తుతం గ్రామ గ్రామానికీ వెళ్లి, ఇంటింటికీ చేరుకుని పక్షవాత బాధితులు, వికలాంగులు, బ్రెయిన్ స్ట్రోక్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తోందన్నారు. అవసరమైన వైద్య సలహాలు, ఫిజియోథెరపీ మార్గదర్శకాలు అందించడంతో పాటు చికిత్స అవసరమైన వారికి తదుపరి వైద్య సహాయం అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేక చాలామంది చికిత్సకు దూరమవుతున్నారని, సమయానికి ఫిజియోథెరపీ అందక జీవితాంతం మంచానికే పరిమితమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లందులో సమగ్ర ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటైతే గిరిజనులు, బడుగు, బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని, ఖమ్మం లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి స్థానికంగానే నాణ్యమైన చికిత్స పొందే అవకాశం కలుగుతుందని వివరించారు. ఈ ప్రతిపాదనను ఎమ్మెల్యే కోరం కనకయ్య సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వ సహకారంతో ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయాలని డాక్టర్ రవి కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే నిజమైన అభివృద్ధికి పునాదని పేర్కొంటూ, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, వైద్య నిపుణులు, సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ కలిసి పనిచేస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య విప్లవం సాధ్యమవుతుందని అన్నా రు. "సేవే మా మార్గం... ప్రతి గ్రామానికి చేరుకోవడం మా లక్ష్యం... ప్రతి బాధితుడి జీవితంలో ఆశ వెలుగు నింపడమే మిషన్ వాక్ ఫౌండేషన్ ధ్యేయం" అని డాక్టర్ బాదావత్ రవి పేర్కొన్నారు

# ఎస్సీ గురుకులంలో దయనీయ పరిస్థితులు

## ఫ్యాన్లు లేక ఉక్కపోత.....

## బాత్‌రూమ్‌లు లేక అడవే దిక్కు....

## స్వంత ఖర్చులతో ఫ్యాన్లు అందించిన పేరెంట్స్ కమిటీ



**మల్లంపల్లి, ప్రభాతవార్త:** ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామంలో వద్ద తాత్కాలికంగా కొనసాగుతున్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (ఎస్సీ గురుకుల) బాలుర పాఠశాల, కళాశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి నెలకొన్నదని వారు ఆరోపించారు. పాఠశాల గదుల్లో సీలింగ్ ఫ్యాన్లు లేక పోవడంతో విద్యార్థులు తీవ్రమైన ఉక్కపోతకు గురవుతున్నారని, దోమల బెడదతో రాత్రిపూట నిద్రలేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు అర్షం రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జాడి ఈశ్వర్ నేతకాని, సభ్యులు రాజేందర్, దుర్గం సమ్మయ్యతో పాటు కోడెపాక రాజు, సత్య నారాయణ తదితరులు స్వంత నిధులతో సీలింగ్ ఫ్యాన్లను కొనుగోలు చేసి పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు.మౌలిక వసతుల లేమితో విద్యార్థుల అవస్థలు... .హాస్టల్‌లో విద్యార్థులకు తగిన మూత్రశాలలు, స్నానాల గదులు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో అడవిలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు పేరెంట్స్ కమిటీ తెలిపింది. గదులకు సరైన తలుపులు, కిటికీలు లేకపోవడం వల్ల అడవి ప్రాంతం నుంచి విషసర్పాలు, ఇతర కీటకాలు లోపలికి వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా గదుల్లో విద్యుత్ స్విచ్‌బోర్డులు, తీగలు బయటకు వేలాడుతూ ఉండటంతో విద్యార్థులకు ఎప్పుడైనా విద్యుదాఘాత ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అడవి ప్రాంతంలో ఉన్న ఈ హాస్టల్‌లో విద్యార్థుల భద్రత పూర్తిగా గాలికొదిలేశారని ఆరోపించారు.అధికారులు వెంటనే స్పందించాలి....ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. తాత్కాలిక ఏర్పాట్లతో కాలయాపన చేయకుండా శాశ్వత భవనాలు, మౌలిక వసతులు, భద్రతా చర్యలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వం స్పందించని నేపథ్యంలో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని స్వంత నిధులతో ఫ్యాన్లు అందించిన పేరెంట్స్ కమిటీ సభ్యులు, దాతలను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు అందుకున్న గురుకుల ప్రిన్సిపల్

## ఉప సర్పంచ్ గుండె వెంకన్న ఆధ్వర్యంలో ఘన సన్మానం



**బూర్గంపహాడ్ ,ప్రభాతవార్త:** బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హరిత గొల్లపల్లి కి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కమిటీ వారు ప్రతిష్టాత్మక "సావిత్రిబాయి పూలే జాతీయ పురస్కారం" ప్రకటించారు.విద్య, సామాజిక సేవా రంగంలో ఆమె చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక అయిన సందర్భంగా మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ఆవరణలో సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ గుండె వెంకన్న ఆధ్వర్యంలో హరిత గొల్లపల్లి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గుండె వెంకన్న మాట్లాడుతూ, "మండలానికి చెందిన మహిళ జాతీయ స్థాయిలో అవార్డు పొందడం మనందరికీ గర్వకారణం. ఆమె సేవలు ఇలాగే కొనసాగాలని" అన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తనకు లభించిన ఈ గౌరవం వెనుక పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజల సహకారం ఉందని హరిత గొల్లపల్లి తెలిపారు. భవిష్యత్తులో మరింత బాధ్యతతో సేవలు అందిస్తానని చెప్పారు.ఈ కార్యక్రమం మండలంలోని మహిళలకు, ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్సెల్ కన్వీనర్ భజన సతీష్ స్థానిక గురుకుల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రీమిడియేషన్ ద్వారా విద్యాబోధన జరగాలి

## ఎమ్. ఇ.ఓ. టి .ప్రభాకర్ .




**వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త :** రీమిడియేషన్ ద్వారా పాఠశాలలో విద్యాబోధన జరగాలని మండల విద్యాధికారి టి ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్ పి ఎస్ ఎస్ నిర్వహిస్తున్న మూడు రోజుల మండల స్థాయి ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ ను మండల విద్యాశాఖ అధికారి టి.ప్రభాకర్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక , హాజరై శిక్షణ కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణకు మండలంలోని సగం మంది ఉపాధ్యాయులు మొదటి దఫా శిక్షణకు దాదాపుగా 26 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ చాలా చక్కగా తెలుగు, ఆంగ్లం, గణితం నందు రీ మిడియేషన్ కి సంబంధించిన సమాచారం ఇక్కడ శిక్షణ పొంది, అనంతరం తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఎఫ్ ఎల్ ఎన్ పద్ధతిలో విద్యార్థులు సామర్థ్యల వారీగా వెనుక బడుటకు గల అంశాలలో శిక్షణ పొంది మంచి ఫలితాలు రావడానికి ఎలా కృషి చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్పీలు, ఏ రాజయ్య, టి రాజేష్ కుమార్, రజిత, సునంద , శ్రీనివాస్, చందర్, మొహమ్మద్ సర్వర్ అహ్మద్, రమేష్,రాజేందర్ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# వర్షంలో అదుపుతప్పిన కారు

## బైక్ ను ఢీకొట్టిన ఘటనలో కూలీకి తీవ్ర గాయాలు

## పసర రాంపూర్ గాంధీనగర్ క్రాస్ రోడ్డులో ప్రమాదం






**గోవిందరావుపేట ప్రభాతవార్త** సోమవారం పసర రాంపూర్ గాంధీనగర్ క్రాస్ రోడ్డులో రాత్రి 7 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాపట్ల గుంపు, గుత్తికోయ గుడానికి,చెందిన వ్యక్తి గాంధీనగర్ లోని ఒక రైతు వద్ద వ్యవసాయ కూలీగా పని చేసి సాయంత్రం ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కర్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి డీజిల్ తెచ్చేందుకు కారులో వస్తుండగా, వర్షం కురుస్తున్న సమయంలో టర్నింగ్ పాయింట్ వద్ద ఎదురెదురుగా వచ్చారు. అదుపు తప్పిన కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో బైక్ రైడర్ కు తీవ్ర గాయా లయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన కారు సంఘటనా స్థలంలోనే ఉండి పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.వర్షాకాలంలో వేగంగా వాహనాలు నడపొద్దు. అంటూ పోలీసులు వాహనదారులకు సూచించారు.

# సిరిగుండంలో అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలి

దుమ్ముగూడెం ప్రభాతవార్త :



దుమ్ముగూడెం మండల పరిధిలోని వలస గొత్తి కోయ గ్రామమైన సిరిగుండంలో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మించాలని నారాయణరావుపేట సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ ఆధ్వర్యంలో సిరిగుండం గ్రామస్తులు సోమవారం భద్రాచలం శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు ఐ సి డి ఎస్ సి డి పి ఓ విజయను కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు గ్రామంలో బాలింతలు గర్భిణీ స్త్రీలు చిన్నపిల్లలు ఉన్నారని అంగనవాడి కేంద్రం లేకపోవడంతో వారికి పౌష్టికాహారం అందట్లేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు దీంతో స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు వారితో మాట్లాడుతూ సిరిగుండంలో అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పలువురు సిరిగుండం గ్రామస్తులు పాల్గొన్నారు

# ప్రతి శనివారం సంత

## ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి.

**ప్రభాతవార్త ఏటూరు నాగారం జులై 20:** మండల కేంద్రంలో సంత లేక ప్రజలందరూ చాలా ఇబ్బందిగా పడుతున్నారని, కూరగాయలు పండ్ల కోసం చిన్నబోయినపల్లి పసర కమలాపురం వెళుతున్నారని అందుకూనను ఏటూర్ నాగారంలో సంత ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకెంత ఉపయోగ పడుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ కార్యదర్శి వాసం జనార్దన్ అన్నారు. ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించనున్న సంతను విజయవంతం చేయాలనే లక్ష్యంతో ఏటూరునాగారం గ్రామస్తులు తాడూరి రఘు, పెండ్యాల ప్రభాకర్, నూతి రమేష్, గండేపల్లి నరసయ్య, ఒక బృందంగా ఏర్పడి కమలాపురం వారాంతపు సంతను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి కూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసర వస్తువుల వ్యాపారులను స్వయంగా కలిసి, వ్యాపారులకు అవసరమైన సహకారం అందిస్తామని, ఏటూరునాగారం పరిసర ప్రాంతాల ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని వివరించారు. వ్యాపారులు కూడా ఏటూరునాగారం శనివారం సంతకు రావడానికి సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. "రైతులకు మంచి గిట్టుబాటు, ప్రజలకు నాణ్యమైన వస్తువులు, వ్యాపారులకు అధిక వ్యాపారం అందించడమే ఏటూరునాగారం శనివారం సంత లక్ష్యం" అని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రతి శనివారం జరిగే ఈ సంతను ప్రజలందరూ ఆదరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఇరిగేషన్ భూమిగా రికార్డులు నమోదు

**దుమ్ముగూడెం ప్రభాతవార్త :** దుమ్ముగూడెం రెవెన్యూ గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సర్వే నెంబర్ 46 లో 0.3800 భూమి ప్రస్తుతం ఇరిగేషన్ కు చెందినదిగా రికార్డులో నమోదయి ఉందని దుమ్ముగూడెం తాసిల్దార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు భూమి రికార్డులు పరిశీలించగా 1970లో ఆర్ఎస్ఆర్ రికార్డు ప్రకారం ప్రభుత్వ భూమిగా నమోదయి ఉందని ప్రస్తుత రికార్డు పరిశీలించగా ఇరిగేషన్ కు చెందినది భూమిగా నమోదయిందని 22 ఏ నిషేధిత జాబితాలో నమోదయి ఉందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు 1996 సంవత్సరంలో ఇద్దరు ఆదివాసీలకు ఏక్ సాల్ కౌలుదారిగా ప్రభుత్వం ఇచ్చిందని ఆయన తెలిపారు అట్టి భూమి ప్రస్తుతం ఇరిగేషన్ కు చెందిన రికార్డులో నమోదయి ఉందని తహసిల్దార్ తెలిపారు